# బలగం TV BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ శనివారం 12, సెప్టెంబర్-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


## ఓటర్ల జాబితా సవరణ..




వివరాలు 4లో..

## దేశవ్యాప్తంగా నిలిచిన బ్యాంకింగ్ సేవలు..




వివరాలు 2లో..

## కులగణన ఒక 'ఎక్స్‌రే'

- తెలంగాణ కులగణన సర్వే దేశానికే ఆదర్శం
- జనగణనలో కులగణనను తప్పనిసరిగా చేర్చాలి
- కులగణన చేద్దామా? వద్దా? బీజేపీ సూటిగా చెప్పాలి
- కులగణనతోనే బలహీన వర్గాలకు న్యాయం..
- దేశ సంపద సమాన పంపిణీకి మార్గం
- తెలంగాణ తరహాలో



దేశవ్యాప్తంగా సర్వే చేయాలి

- వచ్చే ఎన్నికల్లో రాహుల్ గాంధీ ప్రధాని అవుతారు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

వివరాలు 4లో..

## చెరువుల హద్దులకు రక్షణ కవచం

- మత్స్యకారులకు భరోసా
- ఎఫ్‌టీఎల్ హద్దుల పరిరక్షణపై రాజీ పడబోం
- చెరువులకు పరిరక్షణ కమిటీల ఏర్పాటు
- 44 వేల చెరువులకు జియో ట్యాగింగ్
- నెల్లికల్ ఎత్తిపోతల పథకంపై సభాముఖంగా విస్పష్టమైన హామీ



- డిసెంబర్ 2027 నాటికి మొత్తం 24 వేల ఎకరాల ఆయకట్టుకు జలసిరులు
- శాసనమండలిలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

వివరాలు 4లో..

## రైతులకు యాంత్రీకరణ పథకం

- రైతు కోరుకున్న పనిముట్లు.. నచ్చిన కంపెనీ నుంచే కొనుగోలు
- సబ్సిడీ సొమ్ము నేరుగా రైతుఖాతాకే బదిలీ
- రైతుల డిమాండ్‌కు అనుగుణంగా వ్యవసాయ యాంత్రీకరణ
- మంత్రి తుమ్మల మాధానం



వివరాలు 4లో..

## రేవంత్ డైరెక్షన్‌లోనే అంతా జరిగింది




- మహిళా ఎమ్మెల్యేలపై విచక్షణారహితంగా దాడి
- తెలంగాణలో దేశంలోనే ఎక్కడాలేని విధంగా కౌరవసభ
- జాతీయ మహిళా కమిషన్‌కు సబితా ఇంద్రారెడ్డి ఫిర్యాదు

వివరాలు 2లో..

## బొల్లారం ఆయుధాల చోరీ కేసు..



- ఛేదించిన పోలీసులు, మిలిటరీ అధికారులు
- కేసులో నలుగురు నిందితులను అరెస్ట్

వివరాలు 2లో..

## 25 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న మోదీ



- సెప్టెంబర్ 17న ప్రతి ఇంటా దీపాలు వెలిగించాలి
- అక్టోబర్ 17 వరకు సేవా సంకల్ప్ అభియాన్
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు వెల్లడి

వివరాలు 3లో..

# తమ్ముడు.. లెట్స్ డూ కుమ్ముడు

- రేవంత్ రెడ్డి, పొంగులేటి రాష్ట్రాన్ని దోచేస్తున్నారు
- రేవంత్ అధికారంలోకి వచ్చాక పెరిగిన దందాలు
- పరాకాష్ఠకు చేరిన భూ దందాలు, ల్యాండ్ కబ్జాలు
- గాంధీల పేరు చెప్పుకుని ఏలుతున్న గజదొంగలు
- రాష్ట్రంలో మరో సమాంతర రెవెన్యూ సామ్రాజ్యం
- సీఎం రేవంత్‌పై కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు
- 22ఏ జాబితా అనేది దురుద్దేశంతో చేసిన దుర్మార్గం
- 'భూ భారతి' పేరుతో ప్రజల భూములకు 'భూ హారతి'
- కేవలం భూములను కాజేయడమే





పనిగా పెట్టుకున్నారు

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్
- మంత్రి పొంగులేటి రాజీనామాకు హరీష్ రావు డిమాండ్
- తెలంగాణ భవన్‌లో 22ఏ భూ బాధితులతో సమావేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 11: తెలంగాణ భవన్‌లో సెక్షన్ 22ఏ భూ బాధితులతో జరిగిన సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. తమ్ముడు.. లెట్స్ డూ కుమ్ముడు అన్న రీతిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెట్టాపట్టాల్‌వేసుకుని రాష్ట్రాన్ని దోచేసుకుంటున్నారని ఆరోపించారు. కొండల్, తొండల్, అనకొండల్ అంటూ రేవంత్ రెడ్డి సోదరుడు అనుముల కొండల్ రెడ్డి, పొంగులేటి వర్గీయులను ఉద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో భూ దందాలు, ల్యాండ్ కబ్జాలు పరాకాష్ఠకు చేరాయని, అస్మదీయులకు దోచిపెట్టడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అధికారికంగా ఒక రెవెన్యూ వ్యవస్థ ఉంటే.. తెరవెనుక అదృశ్య శక్తులతో కూడిన మరో సమాంతర రెవెన్యూ సామ్రాజ్యం నడుస్తోందని కేటీఆర్ సంచలన ఆరోపణ చేశారు. ఫైళ్లు ఎవరి ఆదేశాల మేరకు కదులుతున్నాయో, అసైన్డ్ భూములు ఎవరి జేబుల్లోకి వెళ్తున్నాయో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందన్నారు. లగచర్లలో తమ అల్లుడికి భూములు కట్టబెట్టడానికి గిరిజనుల

మిగతా 3లో..

అసెంబ్లీకి ట్రాక్టర్లపై వెళ్లిన

## బీజేపీ ఎమ్మెల్యేలు



హైదరాబాద్, సెప్టెంబర్ 11 : తెలంగాణ రాష్ట్రంలోని రైతాంగాన్ని ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన్ మంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రాష్ట్రంలో వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ శాసనసభాపక్షం నిరసన వ్యక్తం చేసింది. శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి అసెంబ్లీ వరకు బీజేపీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు ట్రాక్టర్లతో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. రైతుల పంట నష్టపరిహారం, ఇన్సూరెన్స్ విధానంపై రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును ఎండగడుతూ ఈ వినూత్న నిరసనకు శ్రీకారం చుట్టారు. ఈ ర్యాలీకి బీజేపీ శాసనసభా పక్ష నేతలు, ఎమ్మెల్యేలు , ముఖ్య నాయకులు నేతృత్వం వహించారు. శాసనసభ సమావేశాలు జరుగుతున్న వేళ, రైతుల సమస్యలను సభ దృష్టికి మరియు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడమే లక్ష్యంగా ఎమ్మెల్యే క్వార్టర్స్ బయట ట్రాక్టర్లపై ఎక్కి నినాదాలు చేస్తూ అసెంబ్లీ వైపు దూసుకెళ్లారు. రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడాలని, ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాల వల్ల పంటలు నష్టపోయిన ప్రతీ రైతుకు ఫసల్ బీమా యోజన ద్వారా వెంటనే నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని వారు

మిగతా 3లో..

## ఉద్యోగులకు ప్రమాద బీమా

- కోటి రూపాయల బీమా అందిస్తున్నాం
- ఒక్క రూపాయి ప్రీమియం లేకుండానే బీమా
- ఈ బీమాతో 12.91 లక్షల మందికి లబ్ధి
- అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి వెల్లడి




హైదరాబాద్, సెప్టెంబర్ 11: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. రాష్ట్ర ఖజానాపై, ఉద్యోగుల వేతనాలపై రూపాయి భారం పడకుండా, మానవీయ కోణంలో దేశంలోనే తొలిసారిగా రూ. కోటి దాకా ఉచిత ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించినట్లు ఆయన స్పష్టం చేశారు. ఉద్యోగికి అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగి మరణిస్తే వారి కుటుంబం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో పడుతుంది. అటువంటి కుటుంబాలకు

మిగతా 3లో..

జీహెచ్‌ఎంసీకి యాడ్ ఏజెన్సీల

## భారీ బకాయి

- అడ్వర్టైజింగ్ రూ. 1.86 కోట్ల చొప్పున బకాయిలు




న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) పరిధిలోని అవుట్‌డోర్ అడ్వర్టైజింగ్ ఏజెన్సీలు భారీగా బకాయిలు పడ్డాయి. ఈ ఏజెన్సీల నుంచి జీహెచ్‌ఎంసీకి సుమారు రూ. 39.74 కోట్లు (ఖచ్చితంగా రూ. 39,74,15,778) రావాల్సి ఉందని తెలంగాణ ప్రభుత్వం వెల్లడించింది. ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్ కుమార్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా, పురపాలక- పట్టణాభివృద్ధి శాఖ సెప్టెంబరు 10న శాసనమండలిలో ఈ వివరాలను సమర్పించింది. ప్రభుత్వం అందించిన నివేదిక ప్రకారం.. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో మొత్తం 452 ఏజెన్సీ ఎంట్రీలు, 1,521

మిగతా 3లో..



## తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం

### కొండా సురేఖకు మీనాక్షి నటరాజన్ ఫోన్!

హైదరాబాద్, సెప్టెంబర్ 11: తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ మాజీ మంత్రి కొండా సురేఖకు స్వయంగా ఫోన్ చేసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం తెలిసింది. ప్రస్తుతం రాష్ట్ర శాసనసభ సమావేశాలు కొనసాగుతున్న తరుణంలో, ఇన్‌ఛార్జ్ నేరుగా ఆమెతో మాట్లాడటం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని, చర్చను రేకెత్తిస్తోంది. ఈ ఫోన్ సంభాషణ సందర్భంగా రాష్ట్ర రాజకీయ పరిణామాలు, పార్టీలో జరుగుతున్న తాజా పరిణామాలపై ఇరువురి మధ్య చర్చ జరిగినట్లు తెలుస్తోంది. గతంలో తలెత్తిన కొన్ని వ్యక్తిగత అంశాలు మరియు అంతర్గత విభేదాలను పూర్తిగా పక్కనపెట్టి, భవిష్యత్తులో పార్టీ కార్యక్రమాల్లో తిరిగి ఉత్సాహంగా, చురుగ్గా పాల్గొనాలని మీనాక్షి నటరాజన్ ఆమెకు గట్టిగా సూచించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిఫార్సు మేరకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, కొండా సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసిన విషయం విదితమే. ఆ తర్వాత జరుగుతున్న ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలకు ఆమె హాజరు కాకపోవడం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలోనే పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు ఇన్‌ఛార్జ్ స్వయంగా రంగంలోకి దిగి ఆమెతో మాట్లాడినట్లు తెలుస్తోంది.

# బీసీల జనాభా లెక్కలు తేల్చాలి..

- కులగణన చేపట్టాలి
- బీసీల రిజర్వేషన్లు దానం కాదు..
- హక్కు, సామాజిక న్యాయం కోసం దశాబ్దాల పోరాట ఫలితం
- కేంద్రానికి మంత్రి వాకిటి శ్రీహరి డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 11: దేశవ్యాప్తంగా బీసీల జనాభా, సామాజిక, విద్యా, ఆర్థిక పరిస్థితులపై స్పష్టమైన గణాంకాలు అందుబాటులోకి రావాలంటే కేంద్ర ప్రభుత్వం చేపట్టే జనగణనలో బీసీల కులగణనను తప్పనిసరిగా చేపట్టాలని రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు ు క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి డిమాండ్ చేశారు. శుక్రవారం అసెంబ్లీలో కులగణనపై జరిగిన చర్చలో మంత్రి మాట్లాడారు. బీసీలకు రిజర్వేషన్లు ఎవరో ఇచ్చిన దానం కాదని, అది బీసీల హక్కు, సామాజిక న్యాయం కోసం దశాబ్దాలుగా సాగిన పోరాటం ఫలితమని మంత్రి స్పష్టం చేశారు. 1953లో అప్పటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వం కాకా కాలేల్కర్

మిగతా 3లో..



# కేటీఆర్ ఫోన్ నుంచి ప్రభాస్‌కు ప్రాంక్ కాల్..



## షాకై ఫోన్ కట్ చేసిన డార్లింగ్!

న్యూఢిల్లీ,సెప్టెంబర్11: ది అండర్ 18 వరల్డ్' అనే యూత్ టాక్ షోలో పాల్గొన్న కేటీఆర్‌కు అక్కడున్న చిన్నారులు ఒక క్రేజీ ఛాలెంజ్ విసిరారు. మీ ఫోన్ నుంచి నేరుగా సూపర్ స్టార్ ప్రభాస్‌కు కాల్ చేయాలని కోరడంతో, కేటీఆర్ ఏమాత్రం ఆలోచించకుండా తన వ్యక్తిగత ఫోన్ నుంచి డార్లింగ్ ప్రభాస్‌కు డయల్ చేశారు. అవతలి వైపు నుంచి ప్రభాస్ ఫోన్ లిఫ్ట్ చేసి "గుడ్ ఈవెనింగ్ సార్" అంటూ ఎంతో ఆప్యాయంగా మాట్లాడారు. వెంటనే ఆ చిన్నారులు ఫోన్‌ను తమ చేతిలోకి తీసుకుని సరదాగా ప్రాంక్ చేయడం ప్రారంభించారు. రోడ్డు మీద నడుచుకుంటూ వెళ్తుంటే ఒక ఫోన్ దొరికిందని, చూస్తే ఇందులో మీ నెంబర్ ఉందని, అసలు ఎవరితో మాట్లాడుతున్నామో తెలుసుకోవచ్చా అంటూ ఒక చిన్నారి సరదాగా అబద్ధం ఆడింది. రోడ్డుపై దొరికిన ఫోన్ నుంచి అలా మాట్లాడేసరికి ఆశ్చర్యపోయిన ప్రభాస్, వెంటనే ఎలాంటి మారుమాట్లాడకుండా కాల్ కట్ చేసేశారు. ప్రభాస్ సడన్‌గా కాల్ కట్ చేసేసరికి అక్కడున్న పిల్లలతో పాటు కేటీఆర్ ఒక్కసారిగా గట్టిగా నవ్వుకున్నారు. ఆ తర్వాత కేటీఆర్ మళ్లీ ప్రభాస్‌కు ఫోన్ చేసి అసలు విషయం చెప్పారు. తాము ఒక టాక్ షోలో ఉన్నామని, పిల్లలు సరదాగా ఈ ప్రాంక్ చేశారని వివరించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పిల్లలతో కలిసి తాను చేసిన ఈ సరదా ప్రాంక్ గురించి తెలుసుకుని ప్రభాస్ కూడా నవ్వుతూ సరదాగా ముచ్చటించారు. ప్రస్తుతం ఈ క్యూట్ అండ్ ఫన్నీ వీడియో నెట్టింట వైరల్ అవుతూ అందరినీ అలరిస్తోంది.

# లారీని ఢీకొట్టిన వ్యాన్..



## మహిళలు, పిల్లలతో సహా 9 మంది మృతి

ముంబై: వేగంగా ప్రయాణించిన ఒక వ్యాన్, పెట్రోల్ బంకు నుంచి బయటకు వస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆ వ్యాన్‌లో ఉన్నవారిలో ఆరుగురు మహిళలు, ముగ్గురు పిల్లలతో సహా 9 మంది మరణించారు. పలువురు గాయపడ్డారు. మహారాష్ట్రలోని భండారా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం తెల్లవారుజామున నాగ్‌పూర్-రాయ్‌పూర్ జాతీయ రహదారిలో ఉన్న పింపల్‌గావ్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డు పక్కన ఉన్న పెట్రోల్ బంకు నుంచి హైవేపైకి వస్తున్న ఒక లారీని అతివేగంతో వచ్చిన బొలెరో వాహనం ఢీకొట్టింది. ఎనిమిది మంది అక్కడికక్కడే మరణించగా, చికిత్స పొందుతూ మరొకరు చనిపోయారు. 9 మంది మృతుల్లో ఆరుగురు మహిళలు, ముగ్గురు పిల్లలు ఉన్నారు.కాగా, ఈ ప్రమాదం గురించి తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికులతో కలిసి సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స కోసం సకోలి సబ్ డిస్ట్రిక్ట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. మరణించిన వారి మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.మరోవైపు హైవే సమీపంలో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల ఫుటేజ్‌ను పోలీసులు పరిశీలించారు. ప్రమాదానికి కొద్దిసేపటి ముందు బొలెరో వాహనం అతివేగంగా ప్రయాణించినట్లు ఫుటేజ్‌లో కనిపించింది. లారీని ఢీకొట్టే ముందు వ్యాన్ డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోయినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు.

# టీచర్ల ఇష్టారాజ్యం.. పట్టించుకోని ఎంఈవో..

- ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేసిన డీఈవో




న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11: మునిపల్లి మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్నారనే విమర్శలు మండలంలో జోరుగా వినిపిస్తున్నాయి. ఈ విషయంపై మునిపల్లి మండల విద్యాధికారి భీమ్ సింగ్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో మండలంలోని మేళ సంఘం గ్రామ జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులను జిల్లా విద్యాధికారి రోహిణి సస్పెండ్ చేశారు. ఈ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న వీరన్న (మ్యాథ్స్), భానుప్రకాష్ (ఫిజికల్ సైన్స్) ఉపాధ్యాయులు కొంతకాలంగా పాఠశాలకు వచ్చి సంతకం చేసి, పాఠాలు బోధించకుండా బయటకు వెళ్లి, పాఠశాల ముగిసే సమయానికి వచ్చి సంతకం చేసి ఇంటికి వెళ్తున్నారు.రెండు రోజుల క్రితం ఈ పాఠశాలను జిల్లా విద్యాధికారి (ఇజుూ) రోహిణి సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి పలు విషయాలు తెలుసుకున్నారు. స్కూలుకు వచ్చి సంతకం చేసి బయటకు వెళ్లి తిరిగి వచ్చిన ఆ ఉపాధ్యాయులపై డీఈవో మండిపడ్డారు. ఆ ఉపాధ్యాయులను సస్పెండ్ చేశారు. పాఠశాల ప్రిన్సిపల్ శశికళ, సిబ్బంది ఉషారాణి, మోహన్ బాబులకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ప్రిన్సిపల్‌పై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని డీఈవో అన్నారు.

# భూ భారతి కాదు, భూ హారతి..

## హరీశ్ రావు ఫైర్



హైదరాబాద్, సెప్టెంబర్ 11: భూ భారతి కాదు.. అది భూ హారతి అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. తెలంగాణ భవన్‌లో భూ భారతి అక్రమాలపై ఆధారాలను బయటపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో రాధ అనే వృద్ధురాలికి చెందిన భూమిని భూ భారతి ద్వారా కబ్జా చేశారు. బాధితురాలికి తెలియకుండానే ఆమె భూమిని వేరే వారి పేరిట రిజిస్ట్రేషన్ చేశారని మండిపడ్డారు. కేవలం 10 రోజుల్లోనే ఆమె భూమిని ఆమెకు కాకుండా చేశారు. ధరణిని తీసేసి భూ భారతి తీసుకురావడానికి ముఖ్య కారణం ఇదేనని విమర్శించారు. అలాగే రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పసుమాముల గ్రామంలో అనుముల తిరుపతిరెడ్డి భూ కుంభకోణాన్ని బయటపెట్టారు. గతంలో అనుముల తిరుపతిరెడ్డికి వ్యతిరేకంగా రంగారెడ్డి జిల్లా కోర్టు తీర్పు ఇచ్చింది. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన 5 నెలల్లోనే అనుముల తిరుపతిరెడ్డికి సానుకూలంగా భూమి డాక్యుమెంట్లు మార్చేశారని ఆరోపించారు. ఆ భూమిలో ప్రజలందరూ బిల్డింగ్‌లు కట్టుకుంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం అది వ్యవసాయ భూమి అని అనుముల తిరుపతిరెడ్డి పేరిట డాక్యుమెంట్లు సిద్ధం చేసిందన్నారు.

# దేశవ్యాప్తంగా నిలిచిన బ్యాంకింగ్ సేవలు..

- పెండింగ్‌లో 4 లక్షల కోట్ల విలువైన చెక్కులు




న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11: దేశవ్యాప్తంగా బ్యాంకింగ్ సేవలు నిలిచిపోయాయి. దీంతో కోట్లాది మంది కస్టమర్లు ఇబ్బందిపడుతున్నారు. యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్ల ఆధ్వర్యంలో బ్యాంకు ఉద్యోగుల సమ్మె కొనసాగుతోంది. వారానికి 5 రోజుల పనిదినాల విధానాన్ని అమలు చేయాలని కోరుతూ బ్యాంకింగ్ రంగ ఉద్యోగులు ఆందోళన చేస్తున్నారు. బ్రాంచ్ ఆపరేషన్స్, క్యాష్ డిపాజిట్స్, విత్రడాల్స్, చెక్కు క్లియరెన్సులు నిలిచిపోయాయి. ఉద్యోగులతో పాటు ఆఫీసర్లు కూడా ఈ సమ్మెలో పాల్గొంటున్నారు. చాలా వరకు పబ్లిక్ రంగ బ్యాంకులను మూసివేశారు. యూఎఫ్‌బీయూ గ్రూపులో మొత్తం 9 ఉద్యోగ సంఘాలు ఉన్నాయి, ఇక పబ్లిక్ రంగ బ్యాంకుల్లో సుమారు 8 లక్షల మంది వర్కర్లు ఉన్నట్లు తెలుస్తోంది. బ్యాంకుల మూసివేతతో ఎక్కడికక్కడ చెక్కులు నిలిచిపోయాయి. సుమారు 4 లక్షల కోట్ల మేర విలువైన చెక్కులను పెండింగ్‌లో పెట్టినట్లు తెలుస్తోంది. క్యాష్ ట్రాన్జాక్షన్స్, బిల్ ట్రేడింగ్, బిల్ డిస్కౌంట్ , ట్రేడ అంశాల్లో లావాదేవీలు స్తంభించాయి. ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటాచలం మాట్లాడుతూ అన్ని పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల్లోని ట్రెజరీ ఆపరేషన్స్ నిలిపివేసినట్లు చెప్పారు మధ్యప్రదేశ్, జార్ఖండ్ రాష్ట్రాల్లో ఇప్పటికే ఏటీఎంల్లో నగదు నిండుకున్నది. హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీ, యాక్సిస్ లాంటి బ్యాంకుల్లో ఇవాళ సేవలు కొనసాగాయి. ఆ బ్యాంకుల ఉద్యోగులు ఏ సంఘంలో లేరు. డిజిటల్ బ్యాంకింగ్ సర్వీసులు, ఇంటర్నెట్ బ్యాంకింగ్, యూపీఐలు అభ్యంతరం లేకుండా పనిచేస్తున్నాయి. నెలలో ప్రతి శనివారం కూడా హాలీడే ఇవ్వాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. సోమవారం నుంచి శుక్రవారం వరకు పని సమయాన్ని అదనంగా 40 నిమిషాలు పెంచాలని, ప్రతి శనివారాన్ని హాలీడేగా ప్రకటించాలని కోరుతూ 2023 డిసెంబర్‌లో అధికారులకు అభ్యర్థన సమర్పించినట్లు ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ కాన్ఫిడరేషన్ జనరల్ సెక్రటరీ రూపమ్ రాయ్ తెలిపారు.

# రేవంత్ డైరెక్షన్‌లోనే అంతా జరిగింది

- జాతీయ మహిళా కమిషన్‌కు సబితా ఇంద్రారెడ్డి ఫిర్యాదు




న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11: తెలంగాణ అసెంబ్లీ ముట్టడి సందర్భంగా బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు విచక్షణారహితంగా దాడి చేశారని ఆరోపిస్తూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఢిల్లీ వేదికగా తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఆమె జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌తో పాటు జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యులకు ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆమె, తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద జరిగిన ఘటనలు దేశంలోనే ఎక్కడాలేని విధంగా కౌరవసభను తలపించాయని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతిపక్షాలకు ఉంటుందని, అయితే 30 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్న తమను శాసనసభ లోపలికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారని సబితా ఇంద్రారెడ్డి వాపోయారు. కనీసం మహిళా ప్రజాప్రతినిధులనైనా సభలోకి అనుమతించాలని విన్నవించినా పోలీసులు పట్టించుకోలేదని, మహిళా ఎమ్మెల్యేల జుట్టు పట్టుకుని లాగడమే కాకుండా, పురుష ఎమ్మెల్యేలను కిందపడేసి తొక్కేశారని ఆరోపించారు. ఈ తోపులాటలోనే మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి కిందపడిపోయారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యక్ష ఆదేశాలతోనే పోలీసు బలగాలు తమపై ఈ స్థాయిలో విరుచుకుపడ్డాయని ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. శాసనసభ లోపలైనా ఈ దాడిపై ప్రభుత్వం చర్చ జరుపుతుందని, సీఎం లేదా హోంమంత్రి బాధ్యత వహించి మాట్లాడతారని భావించామని, కానీ దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకపోగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపైనే ఎదురు కేసులు బనాయించారని సబిత ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా ఎమ్మెల్యేలను లైంగికంగా వేధించారంటూ అసత్య ఫిర్యాదులు చేయించడం, కేసీఆర్ నివాసం వద్దకు నిరసనకారులను పంపడం వంటివన్నీ సీఎం రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లోనే జరిగాయని ఆరోపించారు. రాష్ట్రంలో న్యాయం జరగకపోవడం వల్లే తాము ఢిల్లీకి వచ్చి జాతీయ కమిషన్లను ఆశ్రయించాల్సి వచ్చిందని, ఇది తెలంగాణ ప్రభుత్వానికి సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. వంద రోజుల్లో ఇస్తామన్న హామీలను నెరవేర్చడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు మహిళా కానిస్టేబుళ్లను అడ్డుపెట్టుకుని 'శిఖండి రాజకీయాలు' చేస్తోందని ధ్వజమెత్తారు. 22ఎ పేరుతో కోటి ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చి భారీ భూదందాకు తెరలేపారని విమర్శించారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు ఈ దాడుల ఘటనలపై సమగ్ర లేఖలు రాస్తున్నామని, కాంగ్రెస్ నాయకత్వం దీనిపై వెంటనే స్పందించి సమాధానం చెప్పాలని సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ అసమర్థ పాలనతో రైతుల పరిస్థితి దయనీయం

## మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత పువ్వాడ అజయ్ ఆవేదన



హైదరాబాద్, సెప్టెంబర్ 11: ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా సాగునీరు, విద్యుత్ సరఫరా సరిగా లేక రైతుల పరిస్థితి దారుణంగా తయారైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత పువ్వాడ అజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. రైతాంగం కష్టపడి పండించిన పంటలను కాపాడుకునేందుకు అవసరమైన నీటిని, నాణ్యమైన విద్యుత్‌ను అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఈ ఏడు ఎల్ నినో ప్రభావం ఉంటుందని ముందుగానే వాతావరణ శాఖ సంకేతాలు ఇచ్చినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవడంలో విఫలమైందని పువ్వాడ మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, అసమర్థ నిర్ణయాల వల్లే క్షేత్రస్థాయిలో పంట పొలాలు ఎండిపోయే తీవ్రమైన పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీటి ఎద్దడి, విద్యుత్ కోతల సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ మొదటి నుంచీ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ, బాధితుల తరఫున పోరాటాలు చేస్తున్నప్పటికీ పాలకులు కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ ఉదాసీనత కారణంగా జిల్లా వ్యాప్తంగా వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిని రైతులు భారీగా నష్టపోయే ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. వెంటనే స్పందించి అధికారులు క్షేత్రస్థాయిలో ఎండిపోతున్న పంటలను స్వయంగా పరిశీలించాలని, అత్యవసర ప్రాతిపదికన సాగునీరు, అరకొర కోతలు లేకుండా ఉచిత విద్యుత్ సరఫరా చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# బొల్లారం ఆయుధాల చోరీ కేసు..

- ఛేదించిన పోలీసులు, మిలిటరీ అధికారులు
- కేసులో నలుగురు నిందితులను అరెస్ట్

హైదరాబాద్, సెప్టెంబర్ 11: హైదరాబాద్‌లోని బొల్లారంలో ఉన్న మద్రాస్ రెజిమెంట్ బెల్ ఆఫ్ ఆర్మ్స్‌లో జరిగిన భారీ ఆయుధాల చోరీ కేసును పోలీసులు, మిలిటరీ అధికారులు అత్యంత సమర్థవంతంగా ఛేదించారు. ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలను తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి మొత్తం నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. చోరీకి గురైన అత్యంత ప్రమాదకరమైన ఆయుధాలు, మ్యాగజైన్లు, బుల్లెట్లు, బైనాక్యులర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు స్పష్టం చేశారు. ఆగస్టు 31న జరిగిన ఈ ఆయుధాల దొంగతనంలో బెల్ ఆఫ్ ఆర్మ్స్ ఇన్ ఛార్జ్, అమ్యునేషన్ సెక్షన్ ఇన్ ఛార్జ్ సహకారం ఉన్నట్లు విచారణలో తేలింది. మొదట బెల్ ఆఫ్ ఆర్మ్స్‌లోకి ప్రత్యక్షంగా ప్రవేశ అర్హత ఉన్న 16 మందిపై దృష్టి సారించిన అధికారులు, సుదీర్ఘ సాంకేతిక విచారణ చేపట్టారు. ఈ క్రమంలో హవాల్దార్లు టి.పి.ఎస్. రావు, మల్లేశ్ అలియాస్ రాజుల ప్రవర్తన అనుమానాస్పదంగా కనిపించడంతో వారిపై నిఘా పెట్టారు. విచారణ సమయంలో మల్లేశ్ అధికారులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసినప్పటికీ, సాంకేతిక ఆధారాలతో నిలదీయడం, అధికారులు అతడి భార్యకు పరిస్థితి వివరించడంతో అసలు నిజం బయటపడింది. భార్య గట్టిగా ప్రశ్నించడంతో మల్లేశ్ ఆయుధాల దొంగతనం ఒప్పుకున్నాడు. దర్యాప్తు వివరాల ప్రకారం.. నిందితుడు మల్లేశ్ ఆగస్టు 28, 29 తేదీల్లో ఆయుధాగారం వద్ద రెక్కీ నిర్వహించి, రాత్రి వేళల్లో సీసీ కెమెరాలు లేని మార్గాలను గుర్తించాడు. ఆగస్టు 30న కార్గిల్ గేట్ నుంచి లోపలికి వచ్చి పరిస్థితులను గమనించి, 31వ తేదీన పక్కా ప్రణాళికతో ఆయుధాలను చోరీ చేశాడు. ఆర్మీ నుంచి తనను అకారణంగా తొలగించారన్న కోపంతోనే మల్లేశ్ ఈ చర్యకు పాల్పడినట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఆయుధాలను చోరీ చేశాక మొదట ఒక చోట పాతిపెట్టి, ఆ తర్వాత మరో ప్రాంతానికి ఎందుకు మార్చాడనే కోణంలో లోతైన విచారణ సాగుతోందని డీజీపీ వివరించారు. ఈ చోరీకి ఎలాంటి అంతర్జాతీయ ముఠాలతో గానీ, ఉగ్రవాద సంస్థలతో గానీ సంబంధాలు ఉన్నట్లు ఇప్పటివరకు ఆధారాలు లభించలేదని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. దేశ అంతర్గత భద్రతకు తీవ్ర ముప్పుగా పరిణమించే అవకాశం ఉన్న ఈ ప్రమాదకర ఆయుధాల చోరీని సత్వరమే ఛేదించిన మిలిటరీ అధికారులను, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్‌ను, దర్యాప్తు బృందాలను డీజీపీ సీవీ ఆనంద్ ప్రత్యేకంగా ప్రశంసించారు.

# పురపాలక పాలనలో ట్రాన్స్‌జెండర్లు..

## కో-ఆప్షన్ సభ్యులుగా వారికి అవకాశం

## అసెంబ్లీలో కీలక బిల్లుకు ఆమోదం



హైదరాబాద్, సెప్టెంబర్ 11: తెలంగాణ ప్రభుత్వం మరో చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లలో ట్రాన్స్‌జెండర్లకు కో-ఆప్షన్ సభ్యులుగా ప్రాతినిధ్యం కల్పించే బిల్లుకు శాసనసభ శుక్రవారం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో పురపాలక పరిపాలనలో, విధాన నిర్ణయాల్లో ట్రాన్స్‌జెండర్ల భాగస్వామ్యానికి మార్గం సుగమమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరఫున రాష్ట్ర శాసనసభా వ్యవహారాల మంత్రి డి. శ్రీధర్ బాబు 'తెలంగాణ మున్సిపాలిటీల (నాలుగో సవరణ) బిల్లు, 2026'ను సభలో ప్రవేశపెట్టారు. 2019 నాటి తెలంగాణ మున్సిపాలిటీల చట్టానికి ఈ బిల్లు సవరణలు ప్రతిపాదిస్తుంది. దీని ప్రకారం, హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) వెలుపల ఉన్న తొమ్మిది మున్సిపల్ కార్పొరేషన్లలో ఒక్కో ట్రాన్స్‌జెండర్‌ను నామినేటెడ్ సభ్యునిగా కో-ఆప్ట్ చేసుకునే అవకాశం కలుగుతుంది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, సామాజిక వివక్ష, వెలికి గురవుతున్న ట్రాన్స్‌జెండర్లను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడంతో పాటు, ప్రజా జీవితంలో వారి భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగానే ఈ సంస్కరణలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ బిల్లుకు బీజేపీ, సీపీఐ సహా ఇతర పక్షాల సభ్యులు మద్దతు ప్రకటించగా, అనంతరం సభ దీనిని ఏకగ్రీవంగా ఆమోదించింది.

# అనర్హుల ఖాతాల్లో రూ.10 వేలు రిఫండ్



హైదరాబాద్, సెప్టెంబర్ 11: ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అప్లై చేసి.. లిస్ట్‌లో పేరు రాలేదా? అయితే మీకు గుడ్ న్యూస్. అప్లికేషన్ సమయంలో డిపాజిట్‌గా చెల్లించిన రూ.10 వేల మొత్తాన్ని హౌసింగ్ బోర్డు తిరిగి దరఖాస్తుదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయనుంది. ఈ రిఫండ్ ప్రక్రియ నేటి నుంచి ప్రారంభం కానుందని హౌసింగ్ బోర్డు వర్గాలు వెల్లడించాయి. ఇందిరమ్మ ఇళ్ల కోసం అప్లై చేసే సమయంలో ప్రతి ఒక్కరి నుంచి రూ.10 వేల చొప్పున ధరావతు మొత్తాన్ని తీసుకున్న విషయం తెలిసిందే. అయితే దరఖాస్తులను వివిధ శాఖల రికార్డులతో క్రాస్ చెక్ చేసిన అధికారులు.. అర్హత లేని దరఖాస్తులను గుర్తించారు. హైదరాబాద్‌లోని 16 నియోజకవర్గాల పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం మొత్తం 60,720 దరఖాస్తులు వచ్చాయి. వీటిని రెవెన్యూ, రవాణా, జీహెచ్‌ఎంసీ తదితర శాఖల నుంచి సేకరించిన వివరాలతో అధికారులు వెరిఫై చేశారు. ఈ వెరిఫికేషన్‌లో భాగంగా 360 డిగ్రీల తనిఖీ చేపట్టిన హౌసింగ్ బోర్డు.. తొలి దశలోనే సుమారు 40 వేల దరఖాస్తులను అనర్హమైనవిగా గుర్తించింది. దీంతో అర్హత సాధించని వారికి వారు ముందుగా చెల్లించిన రూ.10 వేల మొత్తాన్ని తిరిగి చెల్లించేందుకు చర్యలు చేపట్టింది. ఇందిరమ్మ ఇళ్లకు ఎంపికైన లబ్ధిదారుల్లో కొందరు అప్లికేషన్ సమయంలో తమ మొబైల్ నంబర్లను తప్పుగా నమోదు చేసినట్లు అధికారులు గుర్తించారు. దీంతో ఫోన్ నంబర్ మార్చుకునే అవకాశం కల్పించాలని పలువురు లబ్ధిదారులు కోరారు. దీనిపై స్పందించిన అధికారులు తెలంగాణ హౌసింగ్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లోనే మొబైల్ నంబర్ అప్‌డేట్ చేసుకునే సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఎంపికైన లబ్ధిదారులు తమ దరఖాస్తు నంబర్ లేదా ఆధార్ నంబర్ ఉపయోగించి అప్లికేషన్‌లోకి వెళ్లి వివరాలను మార్చుకోవచ్చు. మరోవైపు హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లకు ఎంపికైన కుటుంబాలపై క్షేత్రస్థాయి సర్వే కొనసాగుతోంది. ఇప్పటివరకు సుమారు 5,500 కుటుంబాలను అధికారులు నేరుగా పరిశీలించినట్లు సమాచారం. లబ్ధిదారుల వివరాలు, అర్హత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో చెక్ చేస్తున్న అధికారులు.. సర్వేను మరో రెండు రోజుల్లో పూర్తి చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రక్రియ పూర్తైన తర్వాత తుది జాబితాను సిద్ధం చేసి హౌసింగ్ బోర్డు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నారు. అంటే.. అర్హులైన వారికి ఇళ్ల కేటాయింపు ప్రక్రియ ముందుకు వెళ్లనుండగా, అర్హత సాధించని దరఖాస్తుదారులకు మాత్రం వారి రూ.10 వేల డిపాజిట్ తిరిగి రానుంది.

బలగం BALAGAM TV
balagamtv100@gmail.com

# (మొదటిపేజీ తరువాయి)

## తమ్ముడు.. లెట్స్ డూ కుమ్ముడు

పొలాలను గుంజుకున్నారని, హైదరాబాద్ చుట్టూ ఉన్న రూ. వేల కోట్ల విలువైన 10 వేల ఎకరాల భూములపై సీఎం రేవంత్ రెడ్డి కన్ను పడిందని విమర్శించారు. మూసీ ముసుగులోనూ, ఫ్యూచర్ సిటీ పేరుతోనూ పెద్ద ఎత్తున రియల్ దందాకు తెరలేపారని దుయ్యబట్టారు. కేసీఆర్ హయాంలో కొంగరకలాన్‌కు ఫాక్స్‌కాన్ వంటి దిగ్గజ కంపెనీ తెచ్చి ప్రాంతపు రూపురేఖలు మార్చితే, రేవంత్ రెడ్డి మాత్రం రూ. 200 కోట్ల విలువైన భూమిని తన తమ్ముడికి చెందిన కంపెనీకి కేవలం రూ. 7 కోట్లకే అడ్డికి పావుశేరు లెక్కన కట్టబెట్టారని కేటీఆర్ ఆరోపించారు. రూ. 1,000 కోట్ల మాయాజాలానికి తెరతీసి కొంగరకలాన్ భూములను కాజేసే కుట్ర జరుగుతోందన్నారు. భూములు ఇచ్చేందుకు నిరాకరించిన సామాన్యుల స్థలాలను ఉద్దేశపూర్వకంగానే నిషేధిత జాబితా అయిన 22ఏ కింద పెట్టి వేధిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాకముందు రియల్ ఎస్టేట్ రంగానికి ఎలాంటి భరోసా లేదని, కానీ కేసీఆర్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే నీరు, విద్యుత్ సమస్యలను తీర్చి భూముల విలువను ఊహించని స్థాయికి తీసుకెళ్లారని కేటీఆర్ గుర్తుచేశారు. ఒకప్పుడు ఎకరం రూ. 5 లక్షలు ఉన్న భూమి కేసీఆర్ హయాంలో రూ. 50 లక్షలకు పెరిగిందని, దీంతో ప్రజలు భూమిపై పెట్టుబడులు పెట్టేందుకు ధైర్యంగా ముందుకు వచ్చారని తెలిపారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో భూమి కనిపిస్తే బుక్క పెట్టు.. జాగా కనిపిస్తే పాగా వేయ్ అనే చందంగా దందాలు నడుస్తున్నాయని విమర్శించారు. గాంధీల పేరు చెప్పుకుని రాష్ట్రాన్ని ఏలుతున్న లీడర్లు గజదొంగల్లా మారారని ఆరోపించారు. గతంలో ధరణి పోర్టల్‌లో బయోమెట్రిక్ వేలిముద్ర పడితే తప్ప అంగుళం భూమి కూడా మారేది కాదని, కానీ నేటి కాంగ్రెస్ భూభారతి అవతారంలో భూముల గోల్‌మాల్‌ను యథేచ్ఛగా నడిపిస్తున్నారని ధ్వజమెత్తారు. సెక్షన్ 22ఏ ఆధారంగా ఓ ముఠాను ఏర్పాటు చేసుకుని అమాయక ప్రజల ఆస్తులను గుంజుకుంటున్న ఈ కుంభకోణంపై ప్రభుత్వం తక్షణమే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బాధితుల తరఫున బీఆర్ఎస్ పోరాడుతుందని, ప్రభుత్వం చేస్తున్న ఈ అక్రమాలపై న్యాయపరంగా, ప్రజాక్షేత్రంలోనూ నిలదీస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన నిషేధిత భూముల జాబితా (22ఏ) వివాదంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వం మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 22ఏ జాబితాలో ప్రజల భూములను చేర్చడం కేవలం సాంకేతిక పొరపాటు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే దురుద్దేశంతో చేసిన పెద్ద దుర్మార్గమని ఆయన ఆరోపించారు. . ప్రస్తుత ప్రభుత్వం 'భూ భారతి' పేరుతో ప్రజల భూములకు 'భూ హారతి' పడుతోందని ఆయన ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలనను పూర్తిగా పక్కనపెట్టి, కేవలం భూములను కాజేయడమే పనిగా పెట్టుకున్నారని హరీశ్ రావు దుయ్యబట్టారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 30 వేల ఎకరాల పాలిటెక్నిక్ కళాశాలల భూములపై ప్రభుత్వం కన్నేశందని ఆరోపించారు. భూ సమస్యల పరిష్కారం కోసం ఫోన్ చేస్తే చాలంటూ ప్రచారం చేసుకున్నారని, కానీ బాధితులు నేరుగా వెళ్లి రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసినా ఎలాంటి న్యాయం జరగడం లేదని విమర్శించారు. మరోవైపు హైడ్రా పేరుతో పేదల ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తున్న ప్రభుత్వం, బడా బాబులు నిర్మించిన భారీ అక్రమ కట్టడాల జోలికి మాత్రం వెళ్లడం లేదని మండిపడ్డారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఏమాత్రం నైతిక బాధ్యత ఉన్నా తక్షణమే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. నిబంధనల ప్రకారం ముఖ్యమంత్రి నివాసాన్ని 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించుకున్న వారు, అదే జాబితాలో నానా ఇబ్బందులు పడుతున్న సామాన్య ప్రజల భూములు మరియు ఇళ్లను ఎందుకు తొలగించడం లేదని సూటిగా నిలదీశారు. తక్షణమే పేదల ఆస్తులను 22ఏ జాబితా నుంచి తొలగించాలని, బాధితులకు పూర్తి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ ముందుండి రాజీలేని పోరాటం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## ఉద్యోగులకు ప్రమాద బీమా

జీవితకాల భరోసా కల్పించాలనే ఆలోచనతోనే ఈ పథకాన్ని తీసుకొచ్చాం" అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ప్రభుత్వం ప్రతి నెలా బ్యాంకుల ద్వారా జీతాలు చెల్లిస్తుందని, బ్యాంకర్లతో చర్చించి వారి వ్యాపార అభివృద్ధికి అనుగుణంగా ఇన్సూరెన్స్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్నామని వెల్లడించారు. అందుకోసమే ప్రభుత్వం 16 ప్రముఖ బ్యాంకులతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని, ఈ మేరకు ఆర్థిక శాఖ జీవో నంబర్ 77ను జారీ చేసిందని వివరించారు. ఉద్యోగికి అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగి మరణిస్తే వారి కుటుంబం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో పడుతుంది. అటువంటి కుటుంబాలకు జీవితకాల భరోసా కల్పించాలనే ఆలోచనతోనే ఈ పథకాన్ని తీసుకొచ్చాం" అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ప్రభుత్వం ప్రతి నెలా బ్యాంకుల ద్వారా జీతాలు చెల్లిస్తుందని, బ్యాంకర్లతో చర్చించి వారి వ్యాపార అభివృద్ధికి అనుగుణంగా ఇన్సూరెన్స్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్నామని వెల్లడించారు. అందుకోసమే ప్రభుత్వం 16 ప్రముఖ బ్యాంకులతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని, ఈ మేరకు ఆర్థిక శాఖ జీవో నంబర్ 77ను జారీ చేసిందని వివరించారు. ??ఈ పథకం ద్వారా ఇప్పటికే 89 ఉద్యోగ కుటుంబాలకు ప్రమాద బీమా పరిహారాన్ని అందించినట్లు డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు. ఇందులో ?సింగరేణిలో 50, ?విద్యుత్ శాఖ ఉద్యోగులు 15, ?వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు 24 మంది ఉన్నారన్నారు. ??శాలరీ, పెన్షన్ అకౌంట్ ప్యాకేజీల ఆధారంగా బీమా ప్రయోజనాలు వర్తిస్తాయని తెలిపారు. ప్రమాదవశాత్తు మరణం, శాశ్వత వైకల్యం సంభవిస్తే ఉచిత బీమా వర్తిస్తుందన్నారు. అంతేకాకుండా విమాన ప్రమాదంలో మరణిస్తే రూ. 2.20 కోట్ల నుంచి రూ. 3 కోట్ల వరకు కవరేజ్ లభిస్తుందని, సాధారణ ప్రమాద మరణానికి కూడా కొన్ని కేటగిరీల్లో రూ. 1.50 కోట్ల కంటే ఎక్కువ బీమా అందుతుందని స్పష్టం చేశారు. ?రాష్ట్రంలో మొత్తం 12,91,046 మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల వ్యవస్థకు ఉచిత బీమా వర్తిస్తుందని వెల్లడించారు. ఇందులో 5,18,293 మంది రెగ్యులర్ ప్రభుత్వ సిబ్బంది ఉన్నారన్నారు. అలాగే 5,00,158 మంది తాత్కాలిక సిబ్బంది , 2,72,615 మంది పెన్షనర్లు కవర్ అవుతారని వివరించారు. ఈ పథకాన్ని మొదటిగా ఫిబ్రవరి 2024లో సింగరేణి ఉద్యోగులకు, ఆ తర్వాత జూన్ 2024 నుంచి విద్యుత్ శాఖ సిబ్బందికి ప్రారంభించి, ప్రస్తుతం రాష్ట్రంలోని కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులతో పాటు అందరికీ వర్తింపజేశామని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ఈ మేరకు అన్ని శాఖల అధిపతులకు, కార్యదర్శులకు కూడా స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని సభలో తెలిపారు.

## జీహెచ్ఎంసీకి యాడ్ ఏజెన్సీల భారీ బకాయి

అడ్వర్టైజ్‌మెంట్ యూనిట్లకు సంబంధించి ఈ బకాయిలు పేరుకుపోయాయి. బకాయిదారుల జాబితాలో పలు ప్రముఖ సంస్థలు ఉన్నాయి. ముఖ్యంగా, యూనియాడ్స్ అనే సంస్థ ఒక్క యూనిట్‌కే అత్యధికంగా రూ. 7.71 కోట్లు చెల్లించాల్సి ఉండగా, ఐ క్యాచ్ కమ్యూనికేషన్స్ మరో యూనిట్‌కు సంబంధించి రూ. 6.47 కోట్లు బకాయిపడింది. అత్యధిక యూనిట్లు కలిగిన సంస్థల్లో ప్రకాశ్ ఆర్ట్స్ ముందు వరుసలో ఉంది. ఈ సంస్థకు చెందిన 53 యూనిట్లకు గానూ మొత్తం రూ. 5.35 కోట్లు బకాయిలు ఉన్నాయి. వీటితో పాటు మీడియా కార్ప్ రూ. 5.06 కోట్లు, సీఎంఎస్ఎస్ రూ. 1.79 కోట్లు, అవుట్‌స్పేస్ అడ్వర్టైజింగ్ రూ. 1.86 కోట్ల చొప్పున బకాయిలు చెల్లించాల్సి ఉంది. అవుట్‌డోర్ ప్రకటనల నియంత్రణ కోసం ప్రభుత్వం ఈ ఏడాది మార్చి, జూన్ నెలల్లో 'అవుట్‌డోర్ అడ్వర్టైజ్‌మెంట్ పాలసీ ఫర్ క్యూర్-2026'ను జారీ చేసింది. దీని ప్రకారం.. ప్రైవేట్ ఆస్తులపై ప్రదర్శించే ప్రకటనలకు ఆన్‌లైన్ ద్వారా, ప్రభుత్వ ఆస్తులపై ప్రకటనలకు టెండర్ల ద్వారా అనుమతులు మంజూరు చేస్తారు. అయితే, ఫీజుల వసూలుకు సంబంధించి 2020 నాటి మార్గదర్శకాలు ప్రస్తుతం నిలిపివేతలో ఉన్నాయని, త్వరలోనే సమగ్రమైన కొత్త విధానాన్ని తీసుకురానున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

## బీసీల జనాభా లెక్కలు తేల్చాలి..

కమిషన్‌ను ఏర్పాటు చేసిందని తెలిపారు. అనంతరం 1979లో బి.పి. మండల్ కమిషన్ ఏర్పడి దేశవ్యాప్తంగా బీసీల సామాజిక, విద్యా వెనుకబాటుతనాన్ని అధ్యయనం చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఓబీసిలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలని మండల్ కమిషన్ సిఫార్సు చేసిందని, 1990లో ఆ సిఫార్సుల అమలుకు కేంద్ర ప్రభుత్వం ముందడుగు వేసిందని గుర్తు చేశారు. 1992లో ఇంద్రా సాహ్నీ కేసులో సుప్రీంకోర్టు ఓబీసి రిజర్వేషన్లకు సంబంధించి కీలకమైన మార్గదర్శకాలు ఇచ్చిందన్నారు. 1993లో జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ ఏర్పడిందని, 2018లో 102వ రాజ్యాంగ సవరణ ద్వారా దానికి రాజ్యాంగ హోదా లభించిందని తెలిపారు. ఉాదీజ రిజర్వేషన్ల ప్రయోజనాలు అన్ని వర్గాలకు సమానంగా అందుతున్నాయా అనే అంశాన్ని పరిశీలించేందుకు జస్టిస్ రోహిణి కమిషన్‌ను కూడా కేంద్రం ఏర్పాటు చేసిందన్నారు. తెలంగాణలో సమగ్ర కుల సర్వే చారిత్రక నిర్ణయం-మంత్రి వాకిటి శ్రీహరి తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుల సర్వే సామాజిక న్యాయానికి పునాది అని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. ఎవరు ఎంతమంది ఉన్నారు? వారి సామాజిక, విద్యా, ఆర్థిక పరిస్థితి ఏమిటి? ప్రభుత్వ ఉద్యోగాల్లో వారి ప్రాతినిధ్యం ఎంత? రాజకీయంగా వారి వాటా ఎంత? అనే అంశాలను డేటా ఆధారంగా తెలుసుకునేందుకు సమగ్ర కుల సర్వే నిర్వహించామని తెలిపారు. "ఇది కేవలం ఒక సర్వే కాదు.. సామాజిక న్యాయానికి పునాది. బీసీల హక్కులకు బలమైన ఆధారం" అని మంత్రి పేర్కొన్నారు. "బీసీలు ఎంతమంది ఉన్నారో తెలియకుండా వారికి ఎంత వాటా ఇవ్వాలో ఎలా నిర్ణయిస్తారు? డేటా లేకుండా సామాజిక న్యాయం ఎలా సాధ్యం?" అని ప్రశ్నించారు. బీసీలకు న్యాయం చేయాలంటే ముందుగా వారి జనాభా, సామాజిక, విద్యా, ఆర్థిక పరిస్థితులపై ఖచ్చితమైన గణాంకాలు అవసరమని అన్నారు. "కేంద్ర ప్రభుత్వం చేపట్టే జనగణనలో బీసీల కులగణనను స్పష్టంగా చేర్చాలి. బీసీలను లెక్కించాలి.. బీసీలకు న్యాయం చేయాలి" అని మంత్రి వాకిటి శ్రీహరి డిమాండ్ చేశారు. "కులగణనచేయండి..సామాజికన్యాయాన్నిబలోపేతంచేయండి"అనిఆయన కేంద్ర ప్రభుత్వానికి పిలుపునిచ్చారు.

## అసెంబ్లీకి ట్రాక్టర్లపై వెళ్లిన బీజేపీ ఎమ్మెల్యేలు

డిమాండ్ చేశారు. ర్యాలీగా వస్తున్న బీజేపీ ఎమ్మెల్యేల ట్రాక్టర్లను అసెంబ్లీ పరిసరాల్లో పోలీసులు అడ్డుకోవడంతో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా బీజేపీ నేతలు పొరుగు రాష్ట్రాలు ఫసల్ బీమా యోజనను సమర్థవంతంగా అమలు చేస్తూ రైతులను ఆదుకుంటుంటే, తెలంగాణలో మాత్రం రాజకీయ ప్రయోజనాల కోసం కేంద్ర పథకాన్ని పక్కనబెడుతున్నారని మండిపడ్డారు. ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వల్ల ఏటా వేలాది మంది రైతులు పంటలు నష్టపోయి ఆర్థికంగా చితికిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వస్తే రైతులకు రూ. 500 బోనస్, పంటల భరోసా ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చాక ఆ హామీలను గాలికొదిలేసిందని విమర్శించారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, ఫసల్ బీమా యోజనలో రాష్ట్ర వాటాను చెల్లించి తక్షణమే ప్రీమియం నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# జూన్ నాటికి ఉప్పల్--నారపల్లి ఫ్లైఓవర్ పూర్తి

హైదరాబాద్, సెప్టెంబర్ 11: హైదరాబాద్ నగర శివారు ప్రాంతాల వాహనదారులకు ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఉప్పల్ నుంచి నారపల్లి వరకు నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్ పనులను వేగవంతం చేసి, 2027 జూన్ నాటికి ఫ్లైఓవర్‌ను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. ఉప్పల్--నారపల్లి మార్గంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించడంతో పాటు వరంగల్ వైపు వెళ్లే వాహనాలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించే ఉద్దేశంతో ఈ ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మిస్తున్నారు. ఇప్పటికే ప్రాజెక్టు పనులు కొనసాగుతున్నప్పటికీ పలు కారణాల వల్ల నిర్మాణం అనుకున్న సమయానికి పూర్తికాలేదు. ఈ నేపథ్యంలో పనుల్లో వేగం పెంచి వచ్చే ఏడాది జూన్ నాటికి ప్రాజెక్టును పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. వాస్తవానికి ఈ ఫ్లైఓవర్‌ను ఈ ఏడాది దసరా నాటికి అందుబాటులోకి తీసుకురావాలని గతంలో భావించారు. అయితే కాంట్రాక్టు సంస్థకు సంబంధించిన సమస్యలు, న్యాయపరమైన అంశాలు తదితర కారణాలతో పనులు ఆలస్యమయ్యాయి. ప్రాజెక్టు కాంట్రాక్టర్ నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్‌ను ఆశ్రయించడంతో నిర్మాణ ప్రక్రియలో అంతరాయం ఏర్పడిందని మంత్రి వివరించారు. పరిస్థితిని చక్కదిద్దేందుకు సెకండరీ ఏజెన్సీని రంగంలోకి తీసుకురావాల్సి వచ్చిందని తెలిపారు. అయినప్పటికీ నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేయలేకపోయామని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న అవరోధాలను తొలగించి నిర్మాణ పనులను మరింత వేగవంతం చేస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోక్యంతో ప్రాజెక్టు పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. జాతీయ రహదారి--163పై ఉప్పల్--నారపల్లి మధ్య ఈ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సుమారు రూ.425 కోట్ల అంచనా వ్యయంతో 2018లో పనులు ప్రారంభమయ్యాయి. ప్రారంభంలో మూడేళ్లలోనే నిర్మాణాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించినప్పటికీ వివిధ కారణాలతో ప్రాజెక్టు గడువు పలుమార్లు పొడిగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ కారిడార్ పూర్తయితే ఉప్పల్, నారపల్లి పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఒత్తిడి తగ్గడంతో పాటు తూర్పు దిశగా ప్రయాణించే వాహనాలకు గణనీయంగా ప్రయోజనం కలగనుంది. ముఖ్యంగా హైదరాబాద్ నగరాన్ని వరంగల్, భువనగిరి, జనగామ ప్రాంతాలతో పాటు బీబీనగర్‌లోని ఎయిమ్స్‌తో అనుసంధానించడంలో ఈ మార్గం కీలకంగా మారనుంది. ప్రాజెక్టు నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు జాతీయ రహదారుల ప్రాంతీయ కార్యాలయ అధికారులు, చీఫ్ ఇంజనీర్‌తో ఇటీవల ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. పెండింగ్ అంశాలను పరిష్కరించి పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే ప్రాజెక్టులో భాగంగా కొన్ని బీటీ రోడ్డు పునరుద్ధరణ, మరమ్మతు పనులు పూర్తయ్యాయని మంత్రి పేర్కొన్నారు. మిగిలిన నిర్మాణ పనులను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లి 2027 జూన్ నాటికి ఉప్పల్--నారపల్లి ఎలివేటెడ్ కారిడార్‌ను పూర్తి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే ఉప్పల్--నారపల్లి మార్గంలో ప్రయాణించే వాహనదారులకు రాకపోకలు మరింత సులభతరం కావడంతో పాటు నగర తూర్పు వైపు విస్తరిస్తున్న ప్రాంతాలకు రవాణా కనెక్టివిటీ మెరుగుపడే అవకాశం ఉంది.

## 25 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న మోదీ

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు వెల్లడి



హైదరాబాద్, సెప్టెంబర్ 11: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల సుదీర్ఘ ప్రజాసేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని తెలంగాణ వ్యాప్తంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు వెల్లడించారు. ప్రజలకు సేవ చేయడం ద్వారా మరింత చేరువ కావడం, అలాగే పార్టీ కార్యకర్తల్లో సేవా భావాన్ని పెంపొందించడమే ఈ అభియాన్ ప్రధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. అభియాన్ ఆరంభ రోజైన సెప్టెంబర్ 17న 'ఆశీర్వాద్ కా దియా' పేరిట రాష్ట్రంలోని ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించి ప్రధానమంత్రికి శుభాకాంక్షలు తెలియజేయాలని రాంచందర్ రావు పార్టీ శ్రేణులకు, ప్రజలకు పిలుపునిచ్చారు. నెల రోజుల పాటు సాగే ఈ ఉత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరాలు, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు. మోదీ పాలనలో జన్‌ధన్ యోజన, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా పేదలను నేరుగా బ్యాంకింగ్ వ్యవస్థతో అనుసంధానించి సంక్షేమ ఫలాలను పూర్తి పారదర్శకంగా అందిస్తున్నామని ఆయన తెలిపారు. యూపీఐ, డిజిటల్ చెల్లింపుల విప్లవంతో భారత్ ప్రపంచ డిజిటల్ పేమెంట్ రంగంలో అగ్రగామిగా నిలిచిందన్నారు. పీఎం విశ్వకర్మ, పీఎం స్వనిధి, ముద్ర రుణాల ద్వారా చేతివృత్తిదారులు, వీధి వ్యాపారులు, చిన్న వ్యాపారులకు ఆర్థిక చేయూతని స్తున్నామని గుర్తుచేశారు. ఈ క్రమంలోనే 'మేరే సప్నో కా భారత్', 'సేవా కీ కహానీ', 'సేవా జ్యోతి కలశ్ యాత్ర', 'సుశాసన్ సేవా సంవాద్' వంటి పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ, మోదీ పథకాలను ప్రతి ఇంటికీ చేరవేస్తామని పేర్కొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణ..

- పలువురు ప్రముఖులకు ఈసీ నోటీసులు




న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11: కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన పలువురు సినీ, క్రీడా రంగాల ప్రముఖులకు నోటీసులు జారీ అయినట్లు తెలుస్తోంది. వీరిలో హీరోయిన్ సమంత, హీరో విజయ్ దేవరకొండ, మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ వంటి వారు ఉన్నట్లు సమాచారం. ఓటర్ల జాబితాలోని వివరాల పరిశీలన నిమిత్తమే ఈ నోటీసులు జారీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ జాబితాలో నటుడు మహేశ్ బాబు, ఆయన భార్య నమ్రత, ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి, నటుడు వెంకటేశ్, ఆయన కుమార్తెలు, నటుడు ఆనంద్ దేవరకొండలతో పాటు క్రీడాకారులు సైనా నెహ్వాల్, మిథాలీ రాజ్, పుల్లెల గోపీచంద్ కూడా ఉన్నట్లు సమాచారం. ఫార్మా దిగ్గజం మురళీ కృష్ణ ప్రసాద్ దివి, మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సతీమణి ఉపాసన కొణిదెల పేర్లు కూడా ఈ జాబితాలో ఉన్నట్లు తెలుస్తోంది. ఓటర్ల పేర్లు లేదా వారి తల్లిదండ్రుల పేర్లలో వ్యత్యాసాలు ఉండటం, పాత రికార్డులతో ప్రస్తుత వివరాలు సరిపోలకపోవడం వంటి కారణాలతో ఈ నోటీసులు పంపినట్లు అధికారులు పేర్కొంటున్నారు. కొన్ని సందర్భాల్లో నిర్దిష్టమైన కారణం ఏదీ పేర్కొనలేదని కూడా వార్తలు వస్తున్నాయి. నోటీసులు అందుకున్న వారు నేరుగా హాజరై తమ వివరాలను సరిచూసుకోవచ్చని లేదా అవసరమైన పత్రాలను సమర్పించి పొరపాట్లను సరిదిద్దుకోవచ్చని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు. ఒకవేళ వ్యక్తిగతంగా హాజరు కాలేని పక్షంలో తమ తరఫున ప్రతినిధులను పంపేందుకు కూడా అవకాశం కల్పించారు. అయితే, నోటీసు జారీ అయినంత మాత్రాన ఓటు హక్కు రద్దయినట్లు కాదని, ఇది కేవలం ధ్రువీకరణ ప్రక్రియలో ఒక భాగం మాత్రమేనని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ ప్రత్యేక సవరణ ప్రక్రియ దేశవ్యాప్తంగా సాగుతోంది. కర్ణాటకలోనూ ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని, జెరోధా వ్యవస్థాపకులు నితిన్, నిఖిల్ కామత్‌లకు కూడా ఇటువంటి నోటీసులే అందాయి. ఇదే క్రమంలో ప్రముఖ శాస్త్రవేత్త, భారతరత్న సీఎన్ఆర్ రావుకు కూడా నోటీసు జారీ అయిందన్న వార్తలను ఎన్నికల సంఘం ఖండించింది.

## గచ్చిబౌలిలో దారుణ హత్య

హైదరాబాద్, సెప్టెంబర్ 11: హైదరాబాద్‌లో దారుణ హత్య వెలుగు చూసింది. రాయదుర్గం పీఎస్ పరిధిలో ఓ వ్యక్తని దారుణంగా కత్తులతో పోడిచి హత్య చేశారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. అంజయ్యనగర్‌లోని హరిహర మెన్ హాస్టల్‌లో శశిధర్(43) వంటమనిషిగా పనిచేస్తున్నాడు. అదే ప్రాంతంలోని శివబాలాజీ హాస్టల్‌లో ప్రమోద్ అనే వ్యక్తి చాఫ్‌గా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి సుమారు 9.30 గంటల సమయంలో ఇద్దరి మధ్య ఏదో విషయంపై చిన్న గొడవ జరిగింది. వివాదం తీవ్ర రూపం దాల్చడంతో ప్రమోద్ కత్తితో శశిధర్‌పై దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. కత్తిపోట్లతో తీవ్రంగా గాయపడిన శశిధర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న వెంటనే రాయదుర్గం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడు ఒడిశాలోని మయూర్భంజ్ జిల్లా డుమురియా మండలం సరాధా గ్రామానికి చెందిన శశిధర్‌గా పోలీసులు గుర్తించారు. నిందితుడిగా అనుమానిస్తున్న ప్రమోద్ స్వస్థలం బాలేశ్వర్ జిల్లా బెల్గోనియా గ్రామంగా గుర్తించారు. అసలు ఈ హత్యకు కారణం ఏమిటి? శశిధర్, ప్రమోద్ మధ్య గతంలో ఏమైనా గొడవలు ఉన్నాయా? హత్యకు ముందు ఇద్దరి మధ్య ఏం జరిగింది? అన్న కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11: దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం నష్టాలతో ముగిశాయి. ఉదయం భారీ నష్టాల్లోకి జారిన సూచీలు చివర్లో కొంత కోలుకున్నాయి. ఐటీ, ఎఫ్ఎంసీజీ, బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్లు సూచీలను కనిష్ఠాల నుంచి కొంత వరకు గట్టెక్కించాయి. అయితే అంతర్జాతీయ మార్కెట్లలో ప్రతికూల పరిస్థితులు దేశీయ మార్కెట్లపై ప్రభావం చూపాయి. సెన్సెక్స్ 120.83 పాయింట్లు నష్టపోయి 74,781.76 వద్ద ముగిసింది. నిఫ్టీ 79.70 పాయింట్లు తగ్గి 23,398.10 వద్ద స్థిరపడింది. నిఫ్టీలో హిందాల్కో ఇండస్ట్రీస్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టాటా స్టీల్ షేర్లు లాభాల్లో ముందున్నాయి. మరోవైపు పలు కీలక రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 0.26 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.58 శాతం నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే మెటల్, రియల్టీ సూచీలు ఎక్కువగా నష్టపోయాయి. ప్రైవేట్ బ్యాంక్, ఐటీ సూచీలు మాత్రం లాభాల్లో కొనసాగి ప్రధాన సూచీలకు కొంత అండగా నిలిచాయి. ముడి చమురు ధరలు పెరగడం, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, భౌగోళిక ఉద్రిక్తతలు మార్కెట్లలో ఒడుదొడుకులను పెంచే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. అయితే దేశీయ ఆర్థిక పరిస్థితులు బలంగా ఉండటం, సంస్థాగత పెట్టుబడులు కొనసాగుతుండటం వల్ల దిగువ స్థాయుల్లో కొనుగోళ్లు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. అమెరికాలో ఉత్పత్తిదారుల ద్రవ్యోల్బణం పెరగడం, ఆర్థిక గణాంకాలు బలంగా ఉండటంతో వడ్డీ రేట్ల విషయంలో కఠిన వైఖరి కొనసాగొచ్చన్న అంచనాలు పెరిగాయి. దీంతో బాండ్ ఈల్డ్స్ పెరిగి విదేశీ పెట్టుబడుల ఉపసంహరణకు మరింత ఊతమిచ్చాయి.

## తెలంగాణలో నకిలీ పన్నీర్ బంద్

- ఏడాది పాటు అనలాగ్ పన్నీర్‌పై నిషేధం
- ప్రభుత్వం కీలక హెచ్చరిక జారీ



హైదరాబాద్, సెప్టెంబర్ 11: : హోటళ్లు, దాబాలు, రోడ్డు పక్కన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో పన్నీర్ బట్టర్ మసాలా, పన్నీర్ టిక్కా అంటూ లొట్టలేసుకుని లాగించే భోజనప్రియులకు తెలంగాణ ప్రభుత్వం కీలక హెచ్చరిక జారీ చేసింది. మార్కెట్లో విచ్చలవిడిగా లభిస్తున్న కృత్రిమ, నాన్-డైరీ అనలాగ్ పన్నీర్ దందాపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎట్టకేలకు ఉక్కుపాదం మోపింది. ప్రజారోగ్యాన్ని తీవ్రంగా ప్రమాదంలో పడేస్తున్న ఈ కృత్రిమ పన్నీర్ తయారీ, నిల్వ, రవాణా, విక్రయాలపై రాష్ట్రవ్యాప్తంగా ఏడాది పాటు పూర్తి నిషేధం విధిస్తూ రాష్ట్ర ఆహార భద్రతా శాఖ కమిషనర్ గురువారం అధికారిక గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్-2006 లోని సెక్షన్ 30(2)(ఎ) కింద ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు. అసలైన పన్నీర్‌ను ఆవు లేదా గేదె పాలతో తయారు చేస్తారు. అయితే, కొందరు కల్తీ రాయుళ్లు అధిక లాభాల కోసం చుక్క పాలు కూడా వాడకుండా పామాయిల్, చౌకైన వెజిటబుల్ ఫ్యాట్స్, పిండి పదార్థాలు, రసాయనాలు కలిపి అచ్చం పన్నీర్‌లా ఉండే అనలాగ్ పన్నీర్ ను తయారు చేస్తున్నారు. చూడటానికి, రుచికి ఇది అసలు పన్నీర్‌లాగే ఉండటంతో సామాన్య ప్రజలు తేడాను గుర్తించలేకపోతున్నారు. మార్కెట్లో అసలు పన్నీర్ ధరకు సగానికే ఇది లభిస్తుండటంతో హోటళ్లు, బేకరీలు, రోడ్ సైడ్ ఫుడ్ సెంటర్లు వీటిని విచ్చలవిడిగా కొనుగోలు చేసి వినియోగదారులకు వడ్డిస్తున్నాయి. ఈ అనలాగ్ పన్నీర్ వాడకం వెనుక తీవ్రమైన ఆరోగ్య ముప్పు దాగి ఉందని ఆహార భద్రతా నిపుణులు హెచ్చరిస్తున్నారు. వెజిటబుల్ ఫ్యాట్స్, రసాయనాల మిశ్రమంతో కూడిన ఈ కల్తీ పన్నీర్‌ను క్రమంగా తీసుకోవడం వల్ల శరీరంలో కొలెస్ట్రాల్ విపరీతంగా పెరిగిపోయి గుండెజబ్బులు, కాలేయ సమస్యలు , జీర్ణకోశ వ్యాధులు తలెత్తుతాయి. దీర్ఘకాలంలో ఇది క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు కూడా దారితీసే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. ప్రజా ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఆహార భద్రతా టాస్క్‌ఫోర్స్ బృందాలు క్షేత్రస్థాయిలో విస్తృత తనిఖీలకు దిగనున్నాయి. ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించి అనలాగ్ పన్నీర్‌ను తయారు చేసినా, హోటళ్లకు సరఫరా చేసినా లేదా విక్రయించినా బాధ్యులపై ఆహార భద్రతా చట్టం కింద కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని కమిషనర్ తీవ్ర హెచ్చరిక చేశారు. అయితే, పూర్తి నిబంధనల ప్రకారం స్వచ్ఛమైన పాలతో తయారయ్యే సాధారణ డెయిరీ పన్నీర్ విక్రయాలకు ఈ నిషేధంతో ఎలాంటి సంబంధం లేదని అధికారులు స్పష్టత ఇచ్చారు. హోటళ్లు, రెస్టారెంట్లు తాము వాడుతున్న పన్నీర్ నాణ్యతను నిరూపించుకోవాల్సిన బాధ్యత వారిపైనే ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఫుడ్ సేఫ్టీ అధికారులు ఇప్పటికే హోటళ్లు, తయారీ యూనిట్లు, ప్రాసెసింగ్ ప్లాంట్లపై ఆకస్మిక దాడులు ప్రారంభించారు. రసాయనాలతో పన్నీర్ తయారు చేసే ముఠాల సమాచారం సేకరిస్తూ శాంపిళ్లను ల్యాబ్‌లకు పంపుతున్నారు. ప్రజలు కూడా ఆహార నాణ్యత విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద ఫుడ్ సెంటర్లపై ఆహార భద్రతా శాఖకు టోల్ ఫ్రీ నంబర్ లేదా ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ నిర్ణయంతో నగరంలో కల్తీ పన్నీర్ దందాకు అడ్డుకట్ట పడుతుందని సగటు పౌరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

# కులగణన ఒక 'ఎక్స్‌రే'

- తెలంగాణ కులగణన సర్వే దేశానికే ఆదర్శం
- జనగణనలో కులగణనను తప్పనిసరిగా చేర్చాలి
- కులగణన చేద్దామా? వద్దా? బీజేపీ సూటిగా చెప్పాలి
- కులగణనతోనే బలహీన వర్గాలకు న్యాయం..
- దేశ సంపద సమాన పంపిణీకి మార్గం
- తెలంగాణ తరహాలో దేశవ్యాప్తంగా సర్వే చేయాలి
- వచ్చే ఎన్నికల్లో రాహుల్ గాంధీ ప్రధాని అవుతారు
- అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్, సెప్టెంబర్ 11:** దేశంలో సామాజిక అసమానతలను తొలగించి బలహీన వర్గాలకు న్యాయం చేయాలంటే జనగణనలో కులగణనను తప్పనిసరిగా చేర్చాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. కులగణన చేద్దామా? వద్దా? అనే విషయాన్ని బీజేపీ సభ్యులు సూటిగా చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, రాజకీయ సర్వే ను దేశానికి ఆదర్శంగా తీసుకుని, దేశవ్యాప్తంగా కూడా ఇలాంటి సమగ్ర సర్వే నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో జనగణన, కులగణన అంశంపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. కులగణన అనేది కులాలకు, రాజకీయ పార్టీలకు సంబంధించిన అంశం కాదని, సమాజ శ్రేయస్సుకు సంబంధించిన విషయమని పేర్కొన్నారు. సమాజంలో నెలకొన్న అసమానతలను సరిచేయాలంటే ముందుగా వాటి తీవ్రతను, స్వభావాన్ని తెలుసుకోవాల్సి ఉంటుందని, అందుకు కులగణన ఎంతో కీలకమని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులపై సమగ్ర సర్వే నిర్వహించిందని భట్టి తెలిపారు. రాష్ట్రంలో ఏ కులానికి ఎంత జనాభా ఉంది, వారి వృత్తులు ఏమిటి, ఆర్థిక పరిస్థితి ఎలా ఉంది, ఎంతమంది చదువుకున్నారు, ఎంతమంది ఉద్యోగాల్లో ఉన్నారు, ఎంతమంది నిరుద్యోగులు, భూమి ఉన్నవారు ఎంతమంది, లేనివారు ఎంతమంది వంటి అనేక అంశాలను కూలంకషంగా సేకరించామని చెప్పారు. ప్లానింగ్ శాఖను పర్యవేక్షిస్తున్న డిప్యూటీ సీఎంగా తాను ప్రతిరోజూ ఈ ప్రక్రియను సమీక్షిస్తూ, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సర్వేను నిర్వహించామని తెలిపారు. తెలంగాణలో నిర్వహించిన ఈ సర్వే దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. సర్వే నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టినప్పుడు ప్రతిపక్ష సభ్యులు సైతం అభినందించారని గుర్తుచేశారు. ?దేశమంతా తెలంగాణ మోడల్ కావాలి తెలంగాణలో జరిగిన సర్వే తరహాలో దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి డిమాండ్ చేస్తోందని భట్టి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి పార్లమెంట్‌లోని వివిధ పార్టీల నాయకులతో పాటు ప్రధానమంత్రిని కూడా కలిసి దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించాలని విజ్ఞప్తి చేశారని చెప్పారు. మంత్రులు కూడా ఈ అంశంపై కేంద్రంపై ఒత్తిడి తెచ్చారని వివరించారు. అయినప్పటికీ కేంద్రం నుంచి ఆశించిన విధంగా స్పందన రాకపోవడంతో ఢిల్లీలో అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానించి సమావేశం నిర్వహించి, తెలంగాణలో అమలు చేసిన విధానాన్ని వివరించామని తెలిపారు. దేశవ్యాప్తంగా ఇదే తరహాలో కులగణన నిర్వహించాలని కోరామని చెప్పారు. జనగణన నిర్వహించే సమయంలోనే కులగణనను కూడా అందులో చేర్చుతామని అప్పట్లో కేంద్రం చెప్పిందని భట్టి గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం జరుగుతున్న జనగణనలో కులగణనను చేర్చక పోవడం బాధాకరమన్నారు. ఇచ్చిన మాట ప్రకారం జనగణనలో కులగణనను చేర్చాలని డిమాండ్ చేశారు. కులగణన లేకుండా దేశంలోని బలహీన వర్గాల వాస్తవ పరిస్థితులను ఎలా గుర్తిస్తారని ప్రశ్నించారు. కులగణనను చేర్చకుండా ప్రజలను పక్కదోవ పట్టించడం సరికాదన్నారు. ?"కులగణన చేద్దామా? వద్దా? అనే విషయాన్ని బీజేపీ సభ్యులు సూటిగా చెప్పాలి. కులగణనకు అనుకూలమైతే సభ తరపున కేంద్ర ప్రభుత్వానికి, ప్రధానమంత్రికి పిలుపునివ్వాలి. వ్యతిరేకమైతే అదే విషయాన్ని స్పష్టంగా చెప్పాలి" అని భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణలో సర్వే జరిగిన విషయాన్ని అసెంబ్లీలోనే అభినందించి, ఇప్పుడు దేశంలో ఎక్కడా కులగణన జరగలేదని చెప్పడం సరైన విధానం కాదన్నారు. తెలంగాణ మోడల్‌ను దేశ వ్యాప్తంగా అమలు చేయాలని కోరుతున్నామని స్పష్టం చేశారు. సమాజంలో ఆస్తులు, వనరులు అందరికీ సమానంగా అందడం లేదని భట్టి పేర్కొన్నారు. ఈ అసమానతలను తొలగించాలంటే ముందుగా సమస్య ఎక్కడ ఉందో తెలుసుకోవాల్సి ఉంటుందని అన్నారు. "సమాజం ఆరోగ్యంగా లేకపోతే ముందుగా ఎక్స్‌రే తీయాలి. వ్యాధిని నిర్ధారించాలి. ఆ తర్వాతే చికిత్స చేయాలి. సమాజంలో ఉన్న అసమానతలను గుర్తించే ఎక్స్‌రేనే కులగణన" అని భట్టి అభివర్ణించారు. కులగణన ద్వారా వివిధ సామాజిక వర్గాల వాస్తవ జనాభా, వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులు స్పష్టంగా తెలుస్తాయని, ఆ సమాచారం ఆధారంగా సంక్షేమ, అభివృద్ధి విధానాలను రూపొందించవచ్చని అన్నారు. జనాభా ప్రాతిపదికన అవకాశాలు, వనరులు, అభివృద్ధి ఫలాలు అందరికీ సమానంగా చేరేలా చర్యలు తీసుకోవచ్చని పేర్కొన్నారు. దేశంలో రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారని భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా తెలంగాణలో నిర్వహించిన తరహాలో సామాజిక, ఆర్థిక, రాజకీయ సర్వే నిర్వహిస్తామని ప్రకటించారు. ఆ సర్వే ద్వారా దేశంలోని వివిధ సామాజిక వర్గాల వాస్తవ పరిస్థితులను తెలుసుకుని, వాటి ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలను రూపొందిస్తామని చెప్పారు. జనాభా ప్రాతిపదికన దేశ అభివృద్ధికి అవసరమైన నిధులు, వనరులు, అవకాశాలు, ఆస్తులు అందరికీ న్యాయంగా, సమానంగా చేరేలా విధానాలను అమలు చేస్తామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

## డీకే శివకుమార్ ప్రభుత్వం సరైన దిశలోనే వెళుతోంది

### ఐదు గ్యారెంటీలను సవ్యంగా అమలు చేస్తున్నాము

### మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10 :** కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నేతృత్వంలోని ప్రభుత్వం సరైన దిశలోనే పయనిస్తోందని మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు సిద్ధరామయ్య ధీమా వ్యక్తం చేశారు. శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనకు, ఆయన మంత్రివర్గానికి సిద్ధరామయ్య అభినందనలు తెలియజేశారు. విధానసౌధలోని బాంక్వెట్ హాల్‌లో గురువారం నిర్వహించిన 'దృఢ కర్ణాటక సంకల్ప – 100 రోజుల విజయవంతమైన ప్రస్థానం' కార్యక్రమంలో సిద్ధరామయ్య ప్రసంగించారు. 100 రోజుల మైలురాయి అనేది కేవలం వేడుకలకు పరిమితం కాకూడదని, ప్రభుత్వం తన పనితీరును ప్రజల ముందు ఉంచి, బాధ్యతలను ఏ మేరకు నెరవేరుస్తోందో నిరూపించుకోవడానికి ఇదొక చక్కని అవకాశమని ఆయన పేర్కొన్నారు. డీకే శివకుమార్ నేతృత్వంలోని సర్కార్ సరైన మార్గంలోనే సాగుతోందని తాను భావిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రతిపక్షాల నుంచి విమర్శలు ఎదురైనప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే ఐదు గ్యారెంటీ పథకాలను విజయవంతంగా అమలు చేసిందని సిద్ధరామయ్య గుర్తు చేశారు. ఈ పథకాల కోసం ఏటా సుమారు రూ. 52,000 కోట్లు వెచ్చిస్తున్నట్లు ఆయన వివరించారు. సామాజిక అసమానతలను తొలగించి, అన్ని వర్గాల పేదలకు అండగా నిలవడమే ఈ పథకాల ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఇదే తరుణంలో ప్రతిపక్ష బీజేపీ తీరుపై సిద్ధరామయ్య విమర్శలు గుప్పించారు. బీజేపీ చేపట్టిన 'బళ్లారి చలో' పాదయాత్రను కేవలం ఒక రాజకీయ గిమ్మిక్కుగా ఆయన అభివర్ణించారు. అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్రంలోని కరువు పరిస్థితులపై చర్చించకుండా, కేవలం మాజీ మంత్రి నాగేంద్ర రాజీనామా అంశంపైనే బీజేపీ రాజకీయం చేస్తోందని ఆరోపించారు.

## పాడి రంగం బలోపేతానికి ప్రజా ప్రభుత్వం చర్యలు

- పాడి రైతులకు గిట్టుబాటు ధర.. గోపాలమిత్రలకు సంక్షేమ సౌకర్యాలు
- మధిర, కొడంగల్‌లో సెర్ప్ భాగస్వామ్యంతో పాడి గేదెల పంపిణీ
- పశుసంవర్ధక శాఖలో 1100 మందికిపైగా ఉద్యోగులకు ప్రమోషన్లు..
- పెరుగుతున్న పాల ఉత్పత్తి- మంత్రి వాకిటి శ్రీహరి

**హైదరాబాద్, సెప్టెంబర్ 11:** రాష్ట్రంలో పాడి పరిశ్రమను మరింత బలోపేతం చేసి, పాడి రైతులకు మెరుగైన ఆదాయం కల్పించడంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. శుక్రవారం శాసనసభలో సభ్యులు పట్లోళ్ల సంజీవరెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, గండ్ర సత్యనారాయణ రావు, వీర్లపల్లి శంకరయ్యలు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో పాల ఉత్పత్తి క్రమంగా పెరుగుతోందని మంత్రి తెలిపారు. 2024--25లో 59.35 లక్షల టన్నులు, 2025--26లో 61.75 లక్షల టన్నుల పాల ఉత్పత్తి నమోదైందన్నారు. 2026--27లో ఆరు నెలల కాలానికి సుమారు 30 లక్షల టన్నుల పాల ఉత్పత్తి జరుగుతుందని ముందస్తు అంచనా ఉన్నట్లు వెల్లడించారు. పాడి రైతుల కష్టానికి తగిన ప్రతిఫలం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. 2026 ఆగస్టు 16 నుంచి గేదె పాలకు ప్రతి కిలో వెన్నకు రూ.914, ఆవు పాలకు ప్రతి కిలో వెన్నతో పాటు మొత్తం ఘనపదార్థాల ప్రాతిపదికన రూ.340 ధరలను నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు. రైతులకు నాణ్యమైన పాల సేకరణకు అనుగుణంగా గిట్టుబాటు ధరలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, పాడి రంగాన్ని గ్రామీణ కుటుంబాలకు స్థిరమైన ఆదాయ వనరుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. పాడి రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా మధిర, కొడంగల్ నియోజకవర్గాల్లో సెర్ప్ భాగస్వామ్యంతో పాడి గేదెల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నామని మంత్రి తెలిపారు. పాడి పశువుల సంఖ్యను పెంచడంతో పాటు, రైతులకు నిరంతర ఆదాయం వచ్చేలా పాడి ఆధారిత జీవనోపాధిని ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. పాడి రంగంలో క్షేత్రస్థాయిలో కీలక సేవలు అందిస్తున్న గోపాలమిత్రల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. గోపాలమిత్రలకు మెడిక్లెయిమ్, వ్యక్తిగత ప్రమాద బీమా, సకాలంలో గౌరవ వేతనం, శిక్షణ, సాంకేతిక సహాయం, పర్యవేక్షణ వంటి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. పశువుల ఆరోగ్యం, పాడి రైతుల ప్రయోజనాలు, గ్రామీణ పాడి వ్యవస్థ బలోపేతంలో గోపాలమిత్రల పాత్ర కీలకమని మంత్రి అన్నారు. పశుసంవర్ధక శాఖలో సిబ్బంది సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని మంత్రి తెలిపారు. 1100 మందికిపైగా ఉద్యోగులకు ప్రమోషన్లు ఇచ్చి, బదిలీల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించామని వెల్లడించారు. ఉద్యోగుల సంక్షేమంతో పాటు శాఖ పనితీరును మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పాడి పరిశ్రమలో ఆక్సిటోసిన్ ఇంజెక్షన్ల వినియోగాన్ని నిరోధించేందుకు ప్రస్తుతం ప్రభుత్వం వద్ద ప్రత్యేకమైన ప్రతిపాదన ఏదీ లేదని మంత్రి స్పష్టం చేశారు. అయితే పశువుల ఆరోగ్యం, పాల నాణ్యత, వినియోగదారుల భద్రత, పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.

# చెరువుల హద్దులకు రక్షణ కవచం...

- మత్స్యకారుల బతుకులకు భరోసా
- ఎఫ్‌టీఎల్ హద్దుల పరిరక్షణపై రాజీ పడబోం
- అన్ని చెరువులకు పరిరక్షణ కమిటీల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం
- ఇప్పటికే 44 వేల చెరువులకు జియో ట్యాగింగ్
- నెల్లికల్ ఎత్తిపోతల పథకంపై సభాముఖంగా విస్పష్టమైన హామీ
- జూన్ 2027 నాటికి 7,800 ఎకరాలకు సాగునీరు
- డిసెంబర్ 2027 నాటికి మొత్తం 24 వేల ఎకరాల ఆయకట్టుకు జలసిరులు
- పీడీఎస్‌లో అదనపు నిత్యావసర సరుకుల పంపిణీపై సానుకూల పరిశీలన
- శాసనమండలిలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్, సెప్టెంబర్ 11:** చెరువు నిండితే పల్లె పచ్చబడుతుందని, మత్స్యకారుడి వల నిండితే అతని కుటుంబంలో వెలుగులు విరుస్తాయని, అందుకే చెరువులు, కుంటలు, ఇతర జలవనరుల పరిరక్షణతోపాటు వాటిపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారుల జీవనోపాధిని కాపాడటాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య అంశంగా భావిస్తోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. చెరువుల పూర్తి నీటిమట్టం---ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) హద్దులను ఎట్టి పరిస్థితుల్లోనూ కాపాడుతామని, జలవనరుల ఆక్రమణలను ఉపేక్షించబోమని ఆయన శాసన మండలి వేదికగా ప్రకటించారు. శుక్రవారం శాసన మండలిలో జరిగిన చర్చ సందర్భంగా సభ్యులు లేవనెత్తిన అంశాలకు మంత్రి సమాధానమిచ్చారు. చెరువుల ఎఫ్‌టీఎల్ హద్దులు దెబ్బతిన్నా, జలవనరులు ఆక్రమణలకు గురైనా, వాటిపై ఆధారపడి జీవించే మత్స్యకార కుటుంబాలకు నష్టం వాటిల్లినా ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుందని చెప్పారు. సభ దృష్టికి తీసుకొచ్చిన నిర్దిష్ట సమస్యను నీటిపారుదల శాఖ అధికారులు స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని మంత్రి ఆదేశించారు. వారం రోజుల్లోగా సంబంధిత చెరువును సందర్శించి, జలవనరుల పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలు, స్థానిక మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి అవసరమైన కార్యాచరణపై నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు. "చెరువులు, వాటి ఎఫ్‌టీఎల్ హద్దుల పరిరక్షణకు నేను సంపూర్ణంగా కట్టుబడి ఉన్నాను. ఎక్కడైనా ఎఫ్‌టీఎల్ హద్దులు దెబ్బతిన్నా, ఆక్రమణలు జరిగినా, మత్స్యకారులకు అన్యాయం వాటిల్లినా నిర్దిష్ట వివరాలను నా దృష్టికి తీసుకురండి. ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్యలు తీసుకుంటుంది" అని మంత్రి సభకు భరోసా ఇచ్చారు. రాష్ట్రం ఏర్పడిన సమయంలో సుమారు 2,150గా ఉన్న మత్స్య సహకార సంఘాల సంఖ్య ప్రస్తుతం ఆరు వేలకు పైగా పెరిగిందని సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. అదేవిధంగా సంఘాల సభ్యత్వం సుమారు రెండు లక్షల నుంచి 6.5 లక్షలకు చేరిందని వివరించారు. చెరువులు, ఇతర జలవనరుల పరిరక్షణలో మత్స్య సహకార సంఘాలకు మరింత క్రియాశీలమైన పాత్ర కల్పిస్తూ సమగ్ర విధానాన్ని రూపొందించాలని సభ్యులు కోరారు. జలవనరుల ఆరోగ్యంతోనే మత్స్యకారుల జీవనోపాధి ముడిపడి ఉన్నందున, చెరువుల పర్యవేక్షణ, చేప పిల్లల సంరక్షణ, ఆక్రమణలు లేదా ఇతర ముప్పులను తక్షణమే ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో మత్స్యకార సంఘాలు స్థానిక సంరక్షకులుగా సమర్థవంతమైన పాత్ర పోషించగలవని సూచించారు. రాష్ట్రంలోని అన్ని చెరువులకు పరిరక్షణ, నిర్వహణ కమిటీలను ఏర్పాటు చేసే ప్రక్రియను ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇటువంటి కమిటీలు పనిచేశాయని, అనంతర కాలంలో ఆ వ్యవస్థ నిలిచిపోయిందని తెలిపారు. జలవనరుల సమర్థ నిర్వహణ, నిరంతర పర్యవేక్షణ, ఆక్రమణల నిరోధానికి కమిటీల వ్యవస్థను పునరుద్ధరించాలని వచ్చిన సిఫారసుల మేరకు ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే సుమారు 44 వేల చెరువులకు జియో ట్యాగింగ్ పూర్తయిందని మంత్రి తెలిపారు. ఈ సమగ్ర సమాచార వ్యవస్థ చెరువుల స్థితిగతులను పర్యవేక్షించడంతోపాటు వాటి పరిరక్షణకు అవసరమైన కార్యాచరణ రూపొందించేందుకు బలమైన ప్రాతిపదికగా ఉపయోగపడుతుందని చెప్పారు. చెరువుల పరిరక్షణకు అదనపు నిధులు అవసరమైతే వాటిని సమకూర్చేందుకు ప్రభుత్వం వెనుకాడబోదని స్పష్టం చేశారు. చెరువుల సంరక్షణ, ఎఫ్‌టీఎల్ హద్దుల పరిరక్షణ, మత్స్యకారుల జీవనోపాధికి భరోసా కల్పించడం ప్రభుత్వ ప్రాధాన్య అంశాలని పునరుద్ఘాటించారు. నల్లగొండ జిల్లాలోని నెల్లికల్ ఎత్తిపోతల పథకాన్ని డిసెంబర్ 2027 నాటికి సంపూర్ణంగా పూర్తి చేసి, సుమారు 24 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శాసన మండలి సాక్షిగా విస్పష్టమైన హామీ ఇచ్చారు. నెల్లికల్ ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య ప్రాజెక్టుగా గుర్తించిందని చెప్పారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్దేశించుకున్న గడువులోగా రెండు దశలను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామని వివరించారు. తొలి దశలో జూన్ 2027 నాటికి 7,800 ఎకరాలకు సాగునీరు అందిస్తామని, మిగిలిన సుమారు 16 వేల ఎకరాలకు డిసెంబర్ 2027 నాటికి నీరందించి మొత్తం 24 వేల ఎకరాల ఆయకట్టును సస్యశ్యామలం చేస్తామని ప్రకటించారు. "సభాముఖంగా విస్పష్టమైన హామీ ఇస్తున్నాను. మొదటి దశను జూన్ 2027 కంటే ముందుగానే పూర్తి చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం. డిసెంబర్ 2027 నాటికి మొత్తం ప్రాజెక్టును పూర్తి చేసి, 24 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తాం" అని మంత్రి స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఈ పథకం పనులకు కేవలం రూ.25.42 కోట్లు మాత్రమే విడుదలయ్యాయని మంత్రి తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటివరకు రూ.310.681 కోట్లు విడుదల చేసి, దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న ప్రాజెక్టు పనులకు వేగం పెంచిందన్నారు. తాను స్వయంగా రెండుసార్లు ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించానని, నీటిపారుదల శాఖ కార్యదర్శి కూడా రెండుసార్లు సందర్శించి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారని తెలిపారు. నెల్లికల్ ప్రాజెక్టును పూర్తి చేసి రైతుల దశాబ్దాల నిరీక్షణకు తెరదించాలన్నది ప్రభుత్వ దృఢ సంకల్పమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పునరుద్ఘాటించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రస్తుతం అందిస్తున్న బియ్యం, గోధుమలు, చక్కెరతోపాటు మరికొన్ని నిత్యావసర సరుకులను పంపిణీ చేసే ప్రతిపాదనను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. శాసన మండలి ప్రశ్నోత్తరాల సమయంలో ప్రొఫెసర్ ఎం.కోదండరామ్‌తోపాటు పలువురు సభ్యులు చేసిన సూచనలపై మంత్రి స్పందించారు. పీడీఎస్ పరిధిలోకి అదనపు సరుకులను తీసుకురావడం ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని, అందుకు అవసరమయ్యే ఆర్థిక భారాన్ని సమగ్రంగా అంచనా వేస్తున్నామని తెలిపారు. "అదనపు నిత్యావసర సరుకుల పంపిణీ అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉంది. ఆర్థిక ప్రభావాన్ని అధ్యయనం చేస్తున్నాం. ఈ ప్రతిపాదనను సానుకూలంగా పరిశీలించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది" అని మంత్రి స్పష్టం చేశారు. సన్నబియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేయడం ద్వారా ప్రభుత్వం ఆహార భద్రతను కల్పిస్తోందని, అయితే పేద కుటుంబాలకు పోషక భద్రతను అందించాలంటే పప్పులు, వంట నూనెలు వంటి సరుకులను కూడా చౌకధరల దుకాణాల ద్వారా పంపిణీ చేయాలని సభ్యులు సూచించారు. దీనివల్ల పేదల ఆహారంలో పోషక విలువలు పెరగడంతోపాటు రాష్ట్రంలో పప్పుధాన్యాలు, నూనెగింజల సాగుకు ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు. చౌకధరల దుకాణాల ఆర్థిక స్థిరత్వం మెరుగుపడి, భవిష్యత్తులో అవి "పేదల సూపర్ బజార్లు"గా రూపాంతరం చెందే అవకాశం ఉంటుందని సభ్యులు అభిప్రాయపడ్డారు.

# రైతులకు యాంత్రీకరణ పథకం

- రైతు కోరుకున్న పనిముట్టు.. నచ్చిన కంపెనీ నుంచే కొనుగోలు
- సబ్సిడీ సొమ్ము నేరుగా రైతుఖాతాకే బదిలీ
- రైతుల డిమాండ్‌కు అనుగుణంగా వ్యవసాయ యాంత్రీకరణ
- మండలిలో మంత్రి తుమ్మల సమాధానం

**హైదరాబాద్, సెప్టెంబర్ 11:** రైతులు తమకు అవసరమైన వ్యవసాయ పనిముట్లను, తమకు నచ్చిన కంపెనీ నుంచి కొనుగోలు చేసుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం యాంత్రీకరణ పథకాన్ని అమలు చేస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. రైతులకు నాణ్యమైన వ్యవసాయ యంత్ర పరికరాలు అందించడంతో పాటు, వారి అవసరాలు, డిమాండ్‌కు అనుగుణంగా యంత్రాలను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. శాసనమండలిలో శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. యాంత్రీకరణ పథకం కింద రైతులకు నాణ్యమైన, ప్రమాణాలు కలిగిన వ్యవసాయ యంత్ర పరికరాలను మాత్రమే అందిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. తయారీదారులు, సరఫరాదారులు అందించే ఉత్పత్తులను ఫార్మ్ మెషినరీ ట్రైనింగ్ అండ్ టెస్టింగ్ ఇన్స్టిట్యూట్ లేదా కేంద్ర వ్యవసాయ శాఖ (ణూడఖీఔ) ద్వారా గుర్తింపు పొందిన సంస్థల వద్ద పరీక్షించిన తర్వాతనే రైతులకు సరఫరా చేస్తున్నామని తెలిపారు. రైతుల భద్రత, యంత్రాల నాణ్యత, పనితీరు వంటి అంశాల్లో ఎలాంటి రాజీ లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. యాంత్రీకరణ పథకం కింద రైతులకు అందించే పరికరాలు వారు కోరుకున్న విధంగా లభించడం లేదని, సబ్సిడీపై అందించే యంత్రాలకు, మార్కెట్లో లభించే యంత్రాలకు తేడా ఉంటుందని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రస్తావించారు. సబ్సిడీ పరికరాలకు ఇచ్చే కొటేషన్ ధరలు, మార్కెట్ ధరల మధ్య వ్యత్యాసం ఉంటోందని పేర్కొన్నారు. డిమాండ్ ఉన్న యంత్రాలను ఎక్కువగా అందించాలని, డ్రోన్లను కూడా అధిక సంఖ్యలో అందించాలని కోరారు. దీనిపై మంత్రి తుమ్మల స్పందిస్తూ, ఎమ్మెల్సీ ప్రస్తావించిన అంశాలు గతంలో ఉన్న పరిస్థితులకు సంబంధించినవని, ప్రస్తుతం ఆ విధానం లేదని స్పష్టం చేశారు. రైతులు తమకు నచ్చిన పనిముట్టును, తమకు నచ్చిన కంపెనీ నుంచి కొనుగోలు చేసుకునే విధంగా ప్రస్తుత యాంత్రీకరణ విధానాన్ని రూపొందించామని తెలిపారు. గత ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులను వినియోగించుకోకుండా యాంత్రీకరణ పథకాన్ని నిలిపివేసిందని మంత్రి తుమ్మల తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని యాంత్రీకరణ పథకాన్ని పునరుద్ధరించి తిరిగి అమలులోకి తీసుకొచ్చిందన్నారు. వ్యవసాయంలో యాంత్రీకరణ పెరగడం ద్వారా రైతులపై శారీరక శ్రమ తగ్గడంతో పాటు, సాగు ఖర్చులు తగ్గి, సమయానికి వ్యవసాయ పనులు పూర్తయ్యే అవకాశం ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో యాంత్రీకరణ పథకం కోసం ప్రభుత్వం రూ.71 కోట్లు కేటాయించగా, రూ.63.11 కోట్లు ఖర్చు చేసి 15,565 వ్యవసాయ యంత్ర పరికరాలను రైతులకు సరఫరా చేసినట్లు మంత్రి వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో యాంత్రీకరణ పథకానికి రూ.147.91 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. రైతుల డిమాండ్‌ను అనుగుణంగా, అవసరమైన వ్యవసాయ యంత్ర పరికరాలను యాంత్రీకరణ పథకం కింద సరఫరా చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. యాంత్రీకరణ పథకం ద్వారా రైతులకు అందించే పరికరాలపై ప్రభుత్వం గణనీయమైన సబ్సిడీని అందిస్తోందని మంత్రి తెలిపారు. చిన్న, సన్నకారు రైతులు, ఎస్సీ, ఎస్టీ రైతులు, మహిళా రైతులకు 50 శాతం సబ్సిడీ, ఇతర రైతులకు 40 శాతం సబ్సిడీతో వ్యవసాయ పనిముట్లు అందిస్తున్నట్లు వెల్లడించారు. దీంతో వ్యవసాయ యంత్ర పరికరాల కొనుగోలుకు రైతులపై పడే ఆర్థిక భారం తగ్గుతుందని మంత్రి పేర్కొన్నారు. రైతులు కోరుకునే విధంగా వ్యవసాయ పనిముట్లు అందుబాటులో ఉండేలా ఎంప్యానెల్‌మెంట్ కమిటీలో రైతులకు కూడా భాగస్వామ్యం కల్పించినట్లు మంత్రి తెలిపారు. కమిటీలో శాస్త్రవేత్తలు, టెక్నికల్ ఇంజనీర్లు, అధికారులతో పాటు ఆదర్శ రైతులు, ఎఫ్‌పీవోలు (ఖీూం) ప్రతినిధులను కూడా భాగస్వాములను చేశామని వివరించారు. రైతుల వాస్తవ అవసరాలు, క్షేత్రస్థాయి పరిస్థితులు, వివిధ ప్రాంతాల్లో సాగు విధానాలను పరిగణనలోకి తీసుకుని యంత్ర పరికరాల ఎంపిక జరిగేలా ఈ విధానం రూపొందించామని తెలిపారు. యాంత్రీకరణ పథకం కింద పరికరాలను సరఫరా చేసేందుకు 444 కంపెనీలు ఎంప్యానెల్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకున్నాయని మంత్రి వెల్లడించారు. అయితే ప్రతి కంపెనీని ఎంపిక చేయడం జరగదని, నిర్దేశిత ప్రమాణాలను పాటించే కంపెనీలను, కేంద్ర ప్రభుత్వానికి చెందిన సంబంధిత సంస్థలు గుర్తించి ఎంపిక చేసే ప్రమాణాలను అనుసరించే కంపెనీలను మాత్రమే జాబితాలో చేర్చుతామని స్పష్టం చేశారు. దీంతో రైతులకు నాణ్యత లేని లేదా ప్రమాణాలు లేని యంత్ర పరికరాలు అందకుండా చూడటంతో పాటు, నాణ్యమైన ఉత్పత్తులకు ప్రాధాన్యత లభిస్తుందని తెలిపారు. యాంత్రీకరణ పథకంలో రైతుకు కొనుగోలు విషయంలో పూర్తి స్వేచ్ఛ కల్పిస్తున్నామని మంత్రి తుమ్మల తెలిపారు. రైతు తనకు నచ్చిన పనిముట్టును, తనకు నచ్చిన కంపెనీ దగ్గరే కొనుగోలు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. ప్రభుత్వం రైతుల తరఫున ఒక నిర్దిష్ట కంపెనీ నుంచి మాత్రమే యంత్రాన్ని కొను గోలు చేయాలని నిర్దేశించడం లేదన్నారు. అదేవిధంగా, రైతులు మార్కెట్లో అందుబాటులో ఉన్న ప్రమాణాలకు అనుగుణమైన తమకు నచ్చిన పరికరాన్ని ఎంపిక చేసుకునే అవకాశం ఉందన్నారు. యాంత్రీకరణ పథకంలో పారదర్శకతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. రైతులకు అందాల్సిన సబ్సిడీ మొత్తాన్ని నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే జమ చేస్తున్నామని చెప్పారు. దళారులకు, మధ్యవర్తులకు అవకాశం లేకుండా రైతుకు నేరుగా ప్రయోజనం అందేలా వ్యవస్థను రూపొందించామని తెలిపారు. రైతు తన అవసరానికి అనుగుణంగా పరికరాన్ని ఎంపిక చేసుకుని కొనుగోలు చేసుకునే అవకాశం ఉండటంతో పాటు, సబ్సిడీ కూడా నేరుగా రైతు ఖాతాలో జమ కావడం ద్వారా పథకం అమలులో పారదర్శకత పెరుగుతుందన్నారు.

బలగం TV BALAGAM రాజన్న సిరిసిల్ల కరీంనగర్ పెద్దపల్లి balagamtv100@gmail.com

# పూట గడవాలంటే బండి ఉండాలి.. ఆ బండినే లాక్కెళ్లారు..



**-రెక్కాడితే గానీ డొక్కాడని బతుకులపై పంచాయతీ దెబ్బ...**
**-ముందస్తు సమాచారం లేకుండానే తోపుడు బండ్లు, సూచిక బోర్డుల తరలింపు**
**-పక్షపాతంగా వ్యవహరిస్తున్నారంటూ గ్రామస్థుల ఆగ్రహం**

బలగం టీవీ,ఎల్లారెడ్డిపేట

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామంలో చిరు వ్యాపారులపై గ్రామ పంచాయతీ సిబ్బంది చర్యలు వివాదాస్పదంగా మారాయి. రోడ్డు పక్కన పండ్లు, కూరగాయలు, ఇతర చిన్నచిన్న వస్తువులు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్న వ్యాపారుల తోపుడు బండ్లు, సూచిక బోర్డులను పంచాయతీ సిబ్బంది ట్రాక్టర్లలో తరలించడంతో బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోజువారీ వ్యాపారంతోనే కుటుంబాలను పోషించుకుంటున్న తమ ఉపాధి సాధనాలను ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా తీసుకెళ్లారని చిరు వ్యాపారులు వాపోతున్నారు. కళ్లముందే తమ బండ్లను తరలించడంతో కుటుంబ పోషణ ఎలా సాగించాలో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చర్యల్లో పక్షపాతమా?

పంచాయతీ సిబ్బంది వ్యవహరించిన తీరుపై స్థానికులు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పక్కన ఉన్న అన్ని వ్యాపారాలపై ఒకే విధంగా చర్యలు తీసుకోకుండా కొందరి తోపుడు బండ్లు, బోర్డులను మాత్రమే తరలించి, మరికొందరు కూరగాయలు, పూల వ్యాపారాలు చేసుకునే వారిని వదిలేయడంపై ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. నిబంధనలు అందరికీ ఒకే విధంగా వర్తించాల్సి ఉండగా, కొందరిపై మాత్రమే చర్యలు ఎందుకు తీసుకున్నారో అధికారులు స్పష్టం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

'మా బతుకులు ఎలా సాగాలి..?

తోపుడు బండ్లను కోల్పోయిన చిరు వ్యాపారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పక్కన ఎలాంటి ఆటంకం కలగకుండా చిన్న వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, ఉన్నట్టుండి తమ బండ్లను తీసుకెళ్లడం వల్ల ఉపాధి కోల్పోయామని చెబుతున్నారు. ఆక్రమణల తొలగింపు అవసరమైతే ముందుగా సమాచారం ఇచ్చి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

పేద చిరు వ్యాపారుల ఉపాధి సాధనాలను స్వాధీనం చేసుకోవడం కాకుండా, నిబంధనల మేరకు సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పరిస్థితిని పరిశీలించి, తరలించిన తోపుడు బండ్లను తిరిగి అప్పగించి చిరు వ్యాపారుల ఉపాధికి భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.



# అంబులెన్సులోనే పురుడు.. 108 సిబ్బంది సమయస్ఫూర్తి..

**-పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చిన రాందేవి.. తల్లీబిడ్డలు క్షేమం**

బలగం టీవీ,గంభీరావుపేట

ప్రసవ వేదనతో తల్లడిల్లుతున్న గర్భిణికి 108 అంబులెన్స్ సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించి సురక్షితంగా ప్రసవం చేశారు. గంభీరావుపేట మండలం రాజుపేట గ్రామంలో నివాసం ఉంటున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాందేవికి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు.వెంటనే స్పందించిన 108 సిబ్బంది గర్భిణిని అంబులెన్సులో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు తీవ్రం అయ్యాయి. పరిస్థితిని గమనించిన ఈఎంటీ చెలిమెల సాయికృష్ణ, పైలట్ నాగరాజు ఏమాత్రం ఆలస్యం చేయకుండా సమయస్ఫూర్తితో వ్యవహరించి అంబులెన్సులోనే ప్రసవం చేశారు.రాందేవి పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ప్రసవం అనంతరం తల్లీబిడ్డలు క్షేమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు 108 సిబ్బంది తెలిపారు.ఆపత్కాలంలో వెంటనే స్పందించి తల్లీబిడ్డల ప్రాణాలను కాపాడుతూ సురక్షితంగా ప్రసవం చేసిన 108 సిబ్బంది సాయికృష్ణ, నాగరాజును కుటుంబ సభ్యులు, గ్రామస్థులు అభినందించారు.

# రాజన్న ఆలయ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :



వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (వీటీఏడీఏ) ఆధ్వర్యంలో చేపడుతున్న శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు.

శుక్రవారం వేములవాడ పట్టణంలో ఆర్అండ్‌బీ, ఇతర శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించిన కలెక్టర్,రాజన్న ఆలయ విస్తరణ పనులు, నిత్యాన్నదాన సత్రం నిర్మాణం, బద్దీ పోచమ్మ ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఇప్పటి వరకు పూర్తయిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

తిప్పాపూర్ బ్రిడ్జి నుంచి రాజరాజేశ్వర స్వామి ఆలయం వరకు చేపడుతున్న 80 అడుగుల రహదారి విస్తరణ పనులను కలెక్టర్ పరిశీలించారు. మురుగునీటి కాలువ, విద్యుత్ టవర్ల నిర్మాణం, రహదారి పనుల పురోగతిపై ఆరా తీశారు. ప్రతి పనిని నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

అనంతరం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ఆలయ విస్తరణ, అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అవసరమైన చోట అదనపు కూలీలను ఏర్పాటు చేసి పనుల వేగాన్ని పెంచాలని ఆదేశించారు. నిత్యాన్నదాన సత్రం నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు.బద్ది పోచమ్మ ఆలయ విస్తరణ పనులను ప్రణాళిక ప్రకారం నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వీటీఏడీఏ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను సంబంధిత శాఖల అధికారులు నిత్యం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, నాణ్యతతో పాటు వేగవంతమైన పురోగతికి పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ రమాదేవి, వేములవాడ ఆర్డీఓ కేవీఎస్‌బీ కుమారి, ఆర్అండ్‌బీ ఎస్ఈ భీమ్లా నాయక్, డీఈ శాంతయ్య, మున్సిపల్ కమిషనర్ లోకేష్, నీటిపారుదల శాఖ అధికారి దయాకర్, తహసీల్దార్ జయంత్, రాజన్న ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.



# కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు

**– బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్**

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, తెలంగాణ రాష్ట్ర సాధకుడు, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను టచ్ చేస్తే తెలంగాణ ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని, అవమానిస్తే కాంగ్రెస్ నాయకుల రాజకీయ పునాదులే కదిలిపోతాయని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ అన్నారు . సిరిసిల్ల పట్టణంలోని బీఆర్ ఎస్ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రవి గౌడ్ మాట్లాడుతూ కేసీఆర్‌పై వ్యక్తిగత విమర్శలు, అనుచిత వ్యాఖ్యలు చేయడం కాంగ్రెస్ నాయకుల రాజకీయ సంస్కారానికి నిదర్శనమని అన్నారు .తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అలుపెరగని పోరాటం చేసి రాష్ట్రాన్ని సాధించిన మహానాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. పదేళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన కే సి ఆర్ తెలంగాణ అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. రాష్ట్ర సాధనలో కేసీఆర్ పోషించిన చారిత్రక పాత్రను ఎవరూ చెరిపివేయలేరన్నారు.కేసీఆర్ తెలంగాణ ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయిన నాయకుడని, ఆయన చేసిన సేవలను ప్రజలు ఎన్నటికీ మర్చిపోరని అన్నారు. కేసీఆర్‌పై వ్యక్తిగతంగా అనుచిత వ్యాఖ్యలు చేయడం కాంగ్రెస్ నాయకులు వెంటనే మానుకోవాలని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు మట్టి శ్రీనివాస్, ఆరెల్లి వినయ్, బల్యాల ప్రవీణ్, సదుల శేఖర్, కోడం వెంకటేశం, చెట్టిపెల్లి హరీశ్, బల్యాల గౌతమ్, మహేష్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం



**– ఎస్పీ మహేష్ బి. గితే**

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల

గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మట్టి గణపతులను పూజించాలని ఎస్పీ మహేష్ బి. గితే పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు మట్టి విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.

గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు, సలహాలను పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో నవరాత్రి ఉత్సవాలను నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. ప్రతి మండప నిర్వాహకుడు తప్పనిసరిగా పోలీసులు సూచించిన 'గణేష్ పోర్టల్'లో మండపానికి సంబంధించిన వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# పోషణ అభ్యాన్ సందర్భంగా అవగాహన కార్యక్రమం

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట

పోషణ అభ్యాన్ సందర్భంగా ఎల్లారెడ్డిపేటలో స్థానికంగా లభించే ఆకుకూరలు, కూరగాయలతో కలిగే పోషక ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే బరువు తక్కువగా ఉన్న పిల్లలకు అందించే బాలామృతం గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ ఎనుగందుల నరసింహులు గారు పాల్గొని, పిల్లల ఆరోగ్యం, పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. స్థానికంగా లభించే పోషక విలువలున్న ఆహార పదార్థాలను పిల్లలకు అందించాలని సూచించారు. పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు సమతుల్య ఆహారం, పోషకాహారం ఎంతో అవసరమని కార్యక్రమంలో వివరించారు.

# చీరపై వాసవి చరిత్ర.. మగ్గంపై మహాద్భుతం..

**-102 ఋషులు,102 గోత్రాలు, 25 చారిత్రక చిత్రాలు**
**-45 రోజుల శ్రమతో సిరిసిల్ల చేనేత కళాకారుడి అపూర్వ ఆవిష్కరణ**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:





చరిత్రను పుస్తకాల్లో చదవడం చూశాం,చిత్రాల్లో చూడడం చూశాం, కానీ చరిత్రనే పట్టుచీరగా నేయడం మాత్రం అద్భుతమే. సిరిసిల్లకు చెందిన ప్రముఖ చేనేత కళాకారుడు వెల్ది హరి ప్రసాద్ ఈ అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు. వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దివ్య చరిత్రను ఏకంగా ఓ పట్టుచీరపై ఆవిష్కరించి చేనేత కళా వైభవాన్ని చాటారు.

గుంటూరుకు చెందిన రత్నకుమారి–కోటేశ్వరరావు ఇచ్చిన ప్రత్యేక ఆర్డర్ మేరకు సుమారు 45 రోజులపాటు శ్రమించి ఈ అపూర్వ చీరను రూపొందించారు. ఇందులో 102 మంది ఋషుల పేర్లు, 102 గోత్రనామాలు, 25 చారిత్రక చిత్రాలను మగ్గంపై అత్యంత సూక్ష్మంగా నేశారు.

పూర్తిగా పట్టుదారంతో రూపొందించిన ఈ చీరలో 2 గ్రాముల బంగారు జరి వినియోగించారు. సుమారు 7 మీటర్ల పొడవున్న ఈ చీరలో భక్తి, చరిత్ర, ఆధ్యాత్మికత, భారతీయ సంస్కృతి, చేనేత నైపుణ్యం కలగలిసిపోయాయి.

అగ్గిపెట్టెలో చీర.. ఇప్పుడు వాసవి చరిత్ర

వెల్ది హరి ప్రసాద్‌కు చేనేత రంగంలో వినూత్న ప్రయోగాలు కొత్తేమీ కావు. గతంలో కేవలం 170 నిమిషాల్లో అగ్గిపెట్టెలో ఇమిడే చీరను మగ్గంపై నేసి ప్రత్యేక గుర్తింపు పొందారు. ఇప్పుడు అదే నైపుణ్యంతో వాసవి కన్యకా పరమేశ్వరి చరిత్రను చీరగా మలిచి మరో అద్భుతాన్ని సృష్టించారు.



# పుట్టినరోజున రక్తదానం..

**అభినందించిన గ్రామ ప్రజలు..**

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:

సామాన్యంగా జన్మదినాలు సంబరాలకు, కేకుల కోతకు మాత్రమే పరిమితమవుతుంటే కొందరు వాటిని మానవతా కార్యక్రమాలకు వేదికగా మార్చుకుంటూ నిస్వార్థ సేవకు నిదర్శనంగా నిలుస్తున్నారు. వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామానికి చెందిన మంథాల ప్రణయ్, అలాంటి వారిలో ముందు వరుసలో నిలుస్తున్నాడు. తన జన్మదినాన్ని సామాజిక సేవకు అంకితంగా మార్చుకుంటూ మానవతా పరమైన గొప్ప ఉదాహరణగా నిలిచాడు. జన్మదినాన్ని సందడిగా కాదు, సదుద్దేశంతో జరుపుకోవాలని నిర్ణయించుకున్న అతను ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా తన పుట్టినరోజు సంధర్భంగా బుధవారం రోజు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదానం చేసి గొప్ప మనసును చాటాడు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుట్టిన రోజు అంటే కేకులు కట్ చేయడం, పార్టీలు చేయడం కాదు. నిజమైన ఆనందం మన రక్తం ఎవరికైనా ప్రాణాధారంగా మారినప్పుడు కలుగుతుందని అందుకే ప్రతి సంవత్సరం జన్మదినాన్ని రక్తదానంతో జరుపుకుంటున్ననన్నాడు. ఎవరికైనా రక్తం అవసరమైతే సంప్రదించాలని ఆయన కోరాడు. ఈ యువకుడి సేవా దృక్పథం పట్ల సమాజానికి మంచి మానవతా సందేశం అందించాడని గ్రామస్థులు, మిత్రులు ఆయన్ను అభినందించారు.

# ఏకరూప దుస్తుల పంపిణీ

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినీ విద్యార్థులకు 2026-27 విద్యా సంవత్సరానికి గాను నిర్దేశించిన ఏకరూప దుస్తులను ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆకునూరు చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించగా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా నారాయణపూర్ గ్రామ సర్పంచ్ దొమ్మాటి నర్సయ్య పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం చక్కని విద్యను అందించడానికి సాయ శక్తులా ప్రయత్నం చేస్తుందని రాబోవు అక్టోబర్ మాసం నుండి అల్పాహారాన్ని అందించబోతుందని ఇప్పటికే సన్నబియ్యంతో కూడిన పౌష్టిక ఆహారాన్ని అందిస్తూ...వారంలో మూడు రోజులు 3సార్లు కోడిగుడ్డుతో కూడిన భోజనాన్ని అందిస్తుందని ,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గత సంవత్సరం 10వ తరగతి విద్యార్థులు అద్భుతమైన మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థాయిలో నిలిచారని ప్రభుత్వం అందిస్తున్న అన్ని సదుపాయాలు ఉపయోగించుకొని ఈ విద్యా సంవత్సరం నారాయణపూర్ పాఠశాల మండలంలోనే కాదు జిల్లాలో ప్రథమ స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమ మరో అతిథి ఉప సర్పంచ్ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సహకారము ,గ్రామ పంచాయతీ సభ్యుల సహకారం, గ్రామస్తుల సహకారం పాఠశాలకు ఎల్లప్పుడూ ఉంటుందని ఏ అవసరమైన తీర్చడానికి తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని తెలియజేయడం జరిగింది.చివరగా సమావేశంలో పాఠశాలలోని ప్రతి విద్యార్థిని విద్యార్థికి ఏకరూప దుస్తులను అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కె శ్రీనివాస్ రెడ్డి ,ఎల్ రాజు, వి తిరుపతిరెడ్డి, రమేష్ రెడ్డి ,ప్రశాంత్, ఆనందం , బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు నిర్వహించాలి

**- పట్టణ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సిరిసిల్ల పట్టణ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ కోరారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో సిరిసిల్ల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పీస్ కమిటీ, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. గణేష్ విగ్రహ ప్రతిష్ఠాపన నుంచి పూజా కార్యక్రమాలు, ఉత్సవాలు, నిమజ్జనం వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసుల సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.గణేష్ మండపాల నిర్వాహకులతో పోలీసులు నిరంతరం సమన్వయం చేసుకుంటారని, ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. పీస్ కమిటీ, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు సమన్వయంతో వ్యవహరించి ఉత్సవాలు సజావుగా జరిగేలా సహకరించాలని కోరారు.

# కాక్రోచ్ జనతా పార్టీ సౌత్ జోన్ కోఆర్డినేటర్‌గా ఉప్పు అశోక్

**-విద్యార్థి ఉద్యమాల్లో చురుకైన పాత్రకు గుర్తింపు**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :



కాక్రోచ్ జనతా పార్టీ సౌత్ జోన్ కోఆర్డినేటర్స్ కమిటీలో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ఉప్పు అశోక్‌కు చోటు లభించింది. తంగళ్లపల్లి మండలం ఒబులాపూర్ (పీ.కే.) గ్రామానికి చెందిన అశోక్‌ను సౌత్ జోన్ కోఆర్డినేటర్‌గా పార్టీ అధికారికంగా నియమించింది.విద్యార్థుల సమస్యల పరిష్కారం, విద్యా వ్యవస్థలో మార్పుల కోసం సీజెపి గత కొంతకాలంగా నిర్వహిస్తున్న ఉద్యమాల్లో అశోక్ చురుగ్గా పాల్గొంటున్నారు. జూన్ 20 నుంచి జూలై 25 వరకు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన విద్యార్థి ఉద్యమంలోనూ ఆయన పాల్గొన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన నిరసన కార్యక్రమాల్లో తెలంగాణ తరపున విద్యార్థుల ప్రతినిధిగా తన వంతు పాత్ర పోషించారు.

దాదాపు నెల రోజుల పాటు ఢిల్లీలో ఉండి ఉద్యమంలో పాల్గొన్న అశోక్.. విద్యార్థులకు న్యాయం చేయాలని, బాధితులకు పరిహారం అందించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జరిగిన పోరాటంలో చురుగ్గా వ్యవహరించారు. తెలంగాణలో సీజెపి నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల్లోనూ పాల్గొంటూ నిర్వహణ, ఆర్గనైజింగ్‌లో కీలకంగా పనిచేస్తున్నారు.

పార్టీ కార్యక్రమాల్లో ఆయన చూపుతున్న చురుకైన పాత్ర, ఉద్యమాల్లో భాగస్వామ్యాన్ని గుర్తించిన సీజెపి తాజాగా ఐదు రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన 21 మందితో సౌత్ జోన్ కోఆర్డినేటర్స్ కమిటీని ఏర్పాటు చేసింది. అందులో ఉప్పు అశోక్‌కు అవకాశం కల్పించి సౌత్ జోన్ కోఆర్డినేటర్‌గా బాధ్యతలు అప్పగించింది.



# గోదావరిఖనిలో లాన్ టెన్నిస్ పోటీలు ప్రారంభం

బలగం టీవీ, రామగుండం

సింగరేణి సంస్థ రామగుండం ఏరియా-1 పరిధిలో ఉద్యోగులకు నిర్వహిస్తున్న 2026-27 అంతర్గత క్రీడల్లో భాగంగా శుక్రవారం లాన్ టెన్నిస్ పోటీలు ప్రారంభమయ్యాయి. రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయం వద్ద ఉన్న లాన్ టెన్నిస్ కోర్టులో నిర్వహించిన పోటీలను ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ (ఏఆర్) సీ. ప్రతాప్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో బొగ్గు ఉత్పత్తితో పాటు ఉద్యోగులు క్రీడల్లో పాల్గొంటూ ఆరోగ్యంగా, దృఢంగా ఉండాలని సూచించారు. క్రీడల వల్ల లాభమే తప్ప నష్టం ఉండదని అన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి కోల్ ఇండియా స్థాయికి ఎంపికై రాణించాలని క్రీడాకారులకు ఆకాంక్షించారు.

పోటీల్లో ఆర్జీ-1 ఏరియా పరిధిలోని వివిధ గనులు, విభాగాలకు చెందిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ గౌరవ కార్యదర్శి జీ. హనుమంతరావు, సమన్వయకర్త గాండ్ల రాజయ్య, వివిధ గనుల క్రీడాకారులు, క్రీడాభిమానులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# విద్యుత్ కోతలతో ఎండిపోతున్న పంటలు

**– సుందరగిరి ప్రధాన రహదారిపై రైతుల రాస్తారోకో**

**– రైతులకు సంఘీభావం తెలిపిన బీఆర్ఎస్ నాయకులు**

బలగం టీవీ,

విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోతున్నాయని, ప్రభుత్వం రైతులకు కరెంట్ అందించడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ రైతులు రాస్తారోకో చేపట్టారు. చిగురుమామిడి మండలం సుందరగిరి చౌరస్తా వద్ద సుందరగిరి, బొమ్మనపల్లి, ఉల్లంపల్లి గ్రామాలకు చెందిన రైతులు శుక్రవారం పెద్ద ఎత్తున ప్రధాన రహదారిపై బైఠాయించారు. మొక్కజొన్న, పత్తి పంటల కర్రలను రోడ్డుపై ఉంచి నిరసన తెలిపారు.

రోజుకు కనీసం ఎనిమిది గంటలు కూడా విద్యుత్ సరఫరా కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బావుల్లో నీరు అందుబాటులో ఉన్నప్పటికీ విద్యుత్ కోతల కారణంగా పంటలకు నీరందించలేని పరిస్థితి నెలకొందన్నారు. ఇటీవల తరచూ విద్యుత్ కోతలు విధించడంతో పంటలకు సాగునీరు అందక ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. విద్యుత్ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమాధానాలు దాటవేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

రైతుల రాస్తారోకోతో ప్రధాన రహదారిపై వాహనాలు భారీగా నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న ఎస్ఐ జగదీశ్వర్ పోలీసులతో కలిసి అక్కడికి చేరుకుని ఆందోళన విరమించాలని కోరారు. అయితే రైతులు వెనక్కి తగ్గకపోవడంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. చివరకు ట్రాన్స్‌కో ఏఈ నరేందర్ అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడి విద్యుత్ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

రైతులకు బీఆర్ఎస్ నాయకుల సంఘీభావం

సుందరగిరి ప్రధాన రహదారిపై విద్యుత్ కోతలకు నిరసనగా రైతులు చేపట్టిన ఆందోళనకు బీఆర్ఎస్ నాయకులు సంఘీభావం తెలిపారు. రైతులతో కలిసి రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా చేశామని, పంటలు ఎండిపోకుండా చర్యలు తీసుకున్నామని వారు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు.

సంఘీభావం తెలిపిన వారిలో సింగిల్ విండో చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ మండల నాయకులు, ఎంపీటీసీలు కత్తుల రమేష్, మిట్టపల్లి మల్లేశం, నాయకులు కంది శంకర్, తిరుపతి, రమేష్, ప్రవీణ్, భిక్షపతి, రాజయ్య, రావుల వెంకన్న, కాసరవేని ఓదేలు, రైతులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ ఒప్పందం సవరించాలి

**-పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి..**

**-సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట రైస్ మిల్లర్ల ధర్నా**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:




తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన రైస్ మిల్లర్లు శుక్రవారం ఆందోళన చేపట్టారు. సిరిసిల్ల పట్టణంలోని కళ్యాణలక్ష్మి గార్డెన్ నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించిన మిల్లర్లు.. అనంతరం కలెక్టరేట్ ఎదుట బైఠాయించి ధర్నా చేశారు.

ఈ సందర్భంగా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పబ్బ నాగరాజు మాట్లాడుతూ.. సీఎంఆర్ ఒప్పందాన్ని ఇరుపక్షాలకు ఆమోదయోగ్యంగా ఉండేలా సవరించాలని ప్రభుత్వాన్ని కోరారు. రైస్ మిల్లులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆకస్మిక తనిఖీలను నిలిపివేసి, మిల్లర్లతో ప్రభుత్వం చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.2014 నుంచి పెండింగ్‌లో ఉన్న సివిల్ సప్లై మిల్లింగ్, రవాణా, డ్రయల్, కస్టోడియల్ చార్జీలను వెంటనే చెల్లించాలని కోరారు. 2022-23 రబీ టెండర్ ధాన్యం ధరను న్యాయబద్ధంగా నిర్ణయించాలని విజ్ఞప్తి చేశారు. రైస్ మిల్లులను వ్యవసాయ అనుబంధ సంస్థలుగా గుర్తించి 200 హెచ్‌పీ వరకు విద్యుత్‌ను ఎల్‌టీ కేటగిరీలో సరఫరా చేయాలని అన్నారు .నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యాన్ని సరఫరా చేయాలని, ధాన్యం నాణ్యతలో వ్యత్యాసం ఉన్న సందర్భంలో దాని నాణ్యతకు అనుగుణంగా బియ్యం రేషియోను నిర్ణయించాలని డిమాండ్ చేశారు. పెనాల్టీ విధించిన మిల్లులకు బకాయిలను నాలుగు విడతల్లో చెల్లించే అవకాశం కల్పించాలని, ఎఫ్‌సీఐ కఠిన నిబంధనలను కొంతమేర సడలించాలని కోరారు.ఈ కార్యక్రమంలో చేపూరి నాగరాజు, గరిపెల్లి ప్రభాకర్, రాజిరెడ్డి, శ్రీనివాస్, అనిల్‌రావు, వంశీధర్‌రావు, సత్యంరావు తదితరులు పాల్గొన్నారు.

# శాత్రాజ్‌పల్లి ఆరోగ్య ఉపకేంద్రాన్ని తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ



**- వర్షాకాల సీజనల్ వ్యాధుల నివారణకు అప్రమత్తంగా ఉండాలి..**

**- డాక్టర్ జి. ఏంజెలా ఆల్ఫ్రెడ్**

బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల:

రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జి. ఏంజెలా ఆల్ఫ్రెడ్ శాత్రాజ్‌పల్లి ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించి అక్కడ అందుతున్న వైద్య సేవలు, సదుపాయాలు, ఔషధాల నిల్వలు, ప్రజారోగ్య కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు.

ఈ సందర్భంగా తల్లీ-శిశు ఆరోగ్య సేవలు, టీకాల కార్యక్రమం, మధుమేహం, రక్తపోటు తదితర అసంక్రమణ వ్యాధుల గుర్తింపు, పరీక్షలు, నివారణ చర్యలపై ప్రత్యేకంగా సమీక్షించారు. అనంతరం స్థానిక ఏఎన్ఎం, సూపర్‌వైజర్, వైద్య సిబ్బందితో సమావేశమై గ్రామంలోని ఆరోగ్య అవసరాలను తెలుసుకున్నారు. ప్రభుత్వ వైద్య పథకాలు ప్రజలకు సమర్థవంతంగా అందుతున్నాయా అనే అంశాన్ని సమీక్షించారు.

ఆరోగ్య సిబ్బంది చేస్తున్న కృషిని అభినందించిన డీఎంహెచ్ఓ, గ్రామ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు మరింత సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, కాలానుగుణ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున సిబ్బంది అందరూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితులు మినహా సెలవులు మంజూరు చేయరాదని సూచించారు.

వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, అతిసారం వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లతో పాటు మలేరియా, డెంగ్యూ సంబంధిత ఆర్‌డీటీ కిట్ల నిల్వలను పరిశీలించాలని, అవసరమైన నిల్వలు లేనిపక్షంలో జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే సమకూర్చుకోవాలని తెలిపారు.

ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రై డే కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములను చేసి దోమల వృద్ధికి కారణమయ్యే నీటి నిల్వలను తొలగించేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. గ్రామస్థాయిలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు శుభ్రత, దోమల నివారణ, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని సూచించారు.

టిబి ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా దేశంలో క్షయ వ్యాధి నిర్మూలన దిశగా పురోగతిని వేగవంతం చేయడానికి క్షేత్రస్థాయి సిబ్బంది విస్తృతంగా పనిచేయాలని డీఎంహెచ్ఓ తెలిపారు. ముఖ్యంగా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్న (వల్నరబుల్) జనాభాను గుర్తించి క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని, పాజిటివ్‌గా నిర్ధారణ అయిన వారికి పూర్తి స్థాయిలో చికిత్స అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ రాజేందర్, సూపర్‌వైజర్ రాజయ్య, గంగమ రాజు, స్థానిక ఆరోగ్య కార్యకర్త శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# మట్టి వినాయకులను ప్రతిష్టిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం..

**-ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలకు దూరంగా ఉండాలి..**

**-మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:



వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్టించి పర్యావరణాన్ని పరిరక్షించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి ప్రజలకు పిలుపునిచ్చారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శుక్రవారం సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, రసాయన రంగులతో తయారైన విగ్రహాలు నిమజ్జనం అనంతరం నీటిలో సులభంగా కరగకపోవడంతో జల కాలుష్యానికి కారణమయ్యే అవకాశం ఉందన్నారు. అందువల్ల సహజ రంగులతో తయారు చేసిన మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్టించుకుని భక్తిశ్రద్ధలతో వినాయక నవరాత్రి ఉత్సవాలను నిర్వహించుకోవాలని కోరారు.ప్రజలందరికీ ముందస్తుగా వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మున్సిపల్ పాలకవర్గ సభ్యులతో కలిసి ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖాదీర్ పాషా, కౌన్సిలర్లు వేముల రాములు, దొంతునేని కళ్యాణి అశోక్‌రావు, కూర భాగ్యలక్ష్మి దేవరాజ్, బొద్దుల శ్రీనివాస్, ఆడెపు చంద్రకళ ప్రభాకర్, అడిచెర్ల రూపా సాయికృష్ణ, కల్లూరి రేణుక రాజు, కొండ వర్షిని నరేష్, ఊరగొండ లక్ష్మీరాజు, కోఆప్షన్ సభ్యుడు నంది శంకర్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# ఎస్సారెస్పీ పునర్జీవ పథకాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు



**– ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు సాగునీరు విడుదల చేయాలి**

**– చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్**

బలగం టీవీ, చొప్పదం

ఎస్సారెస్పీ పునర్జీవ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు వెంటనే సాగునీటిని విడుదల చేయాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి గాయత్రి పంప్‌హౌస్‌కు నీటిని విడుదల చేసి, ఎస్సారెస్పీ పునర్జీవ పథకం ద్వారా వరద కాలువకు నీటిని తరలించాలని కోరారు. అక్కడి నుంచి లింక్ కెనాల్ ద్వారా కాకతీయ కెనాల్‌కు సాగునీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు.

వరద కాలువ లింక్ కెనాల్ నుంచి కాకతీయ కెనాల్‌కు సాగునీటిని విడుదల చేయాలని కోరుతూ రైతులతో కలిసి ర్యాలపల్లి లింక్ కెనాల్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ పునర్జీవ పథకంలో భాగంగా వరద కాలువ లింక్ కెనాల్ నుంచి కాకతీయ కెనాల్‌కు నీటిని విడుదల చేసే అవకాశం ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రభుత్వం సాగునీటిని విడుదల చేయకపోవడంతో కెనాల్ పరివాహక ప్రాంతాల్లో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారిందన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీతో సంబంధం లేకుండా కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోసుకునే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వరద కాలువ లింక్ కెనాల్ ద్వారా కాకతీయ కెనాల్‌ను అనుసంధానం చేసి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని వేలాది ఎకరాలకు సాగునీరు అందించవచ్చని తెలిపారు.

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో చేపట్టిన ఎస్సారెస్పీ పునర్జీవ పథకం విజయవంతం కావడంతో వరద కాలువ జీవనదిలా మారిందని రవిశంకర్ పేర్కొన్నారు. వరద కాలువ ద్వారా ఎస్సారెస్పీ కాకతీయ ప్రధాన కాలువలోకి నీటిని విడుదల చేసేందుకు రూ.30 కోట్లతో లింక్ కెనాల్ నిర్మించినట్లు గుర్తుచేశారు. వరద కాలువ 88.400 కిలోమీటర్ వద్ద నుంచి 3,006 క్యూసెక్కుల సామర్థ్యంతో మూడు కిలోమీటర్ల మేర కాలువను తవ్వి, కాకతీయ ప్రధాన కాలువ 97.460 కిలోమీటర్ వద్ద అనుసంధానం చేసినట్లు వివరించారు.

గంగాధర మండలం ర్యాలపల్లి గ్రామ పరిధిలో వరద కాలువకు రెండు గేట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటి ద్వారా చొప్పదండి, ధర్మపురి, కరీంనగర్, పెద్దపల్లి, మంథని నియోజకవర్గాల్లోని వేలాది ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉందన్నారు. వెంటనే వరద కాలువ లింక్ కెనాల్ నుంచి కాకతీయ కెనాల్‌కు నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని రవిశంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# యూఎస్ ఓపెన్ 'ఫైనల్' లో సబలెంకతో రిబకినా ఢీ!



### కోకో గాఫ్‌ను ఓడించి ఫైనల్లోకి అడుగుపెట్టిన కజకిస్థాన్ స్టార్

### 13 ఏళ్ల తర్వాత తొలిసారి 1, 2 సీడ్ల మధ్య టైటిల్ సమరం

**బలగం టీవీ, హైదరాబాద్**

యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగాన ఆసక్తికరమైన తుది సమరానికి వేదిక సిద్ధమైంది. కజకిస్థాన్ స్టార్ ప్లేయర్, వరల్డ్ నంబర్-2 ఎలినా రిబకినా ఫైనల్లోకి ప్రవేశించింది. గురువారం హోరాహోరీగా జరిగిన సెమీఫైనల్ పోరులో రిబకినా 3-6, 6-4, 6-4 తేడాతో అమెరికా సంచలనం కోకో గాఫ్‌ను చిత్తు చేసి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. శనివారం జరగనున్న ఫైనల్లో వరల్డ్ నంబర్-1 అరినా సబలెంకతో రిబకినా తలపడనుంది.

సబలెంక హ్యాట్రిక్ కల: మరో సెమీఫైనల్లో ప్రపంచ నంబర్ వన్ అరినా సబలెంక 7-5, 6-2 స్కోరుతో అమెరికాకు చెందిన జెస్సికా పెగులాపై సునాయాస విజయం సాధించి ఫైనల్లోకి అడుగుపెట్టింది. గత 99 వారాలుగా ప్రపంచ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్న సబలెంక, వరసగా మూడోసారి యూఎస్ ఓపెన్ టైటిల్‌ను గెలుచుకుని హ్యాట్రిక్ సాధించాలని పట్టుదలతో ఉంది.

నెంబర్-1 ర్యాంక్ రేసు: శనివారం జరిగే ఫైనల్ పోరు కేవలం టైటిల్ కోసమే కాకుండా వరల్డ్ నంబర్-1 ర్యాంక్ కోసం కూడా కావడం గమనార్హం. ఒకవేళ రిబకినా ఫైనల్లో సబలెంకను ఓడిస్తే, ఆమె కెరీర్‌లో తొలిసారి ప్రపంచ నంబర్-1 ర్యాంక్‌ను కైవసం చేసుకునే అవకాశం ఉంది.

13 ఏళ్ల తర్వాత అరుదైన ఘనత: యూఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ టాప్-2 సీడ్లు పోటీపడడం 2013 తర్వాత ఇదే తొలిసారి. 2013లో చివరిసారిగా అప్పటి టాప్ సీడ్లు సెరీనా విలియమ్స్, విక్టోరియా అజరెంకా తుది పోరులో తలపడ్డారు. మళ్లీ 13 ఏళ్ల తర్వాత ఇప్పుడు సబలెంక, రిబకినాల మధ్య పోరు జరగనుండటంతో టెన్నిస్ అభిమానుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

# ఆసియా కప్ ఫైనల్‌కు శ్రీలంక

### పాకిస్థాన్‌పై శ్రీలంక నాలుగు వికెట్ల తేడాతో విజయం

### మహిళల ఆసియా కప్ ఫైనల్లో భారత్-శ్రీలంక ఢీ

**బలగం టీవీ, హైదరాబాద్**

మహిళల ఆసియా కప్ ఫైనల్లో భారత్, డిఫెండింగ్ చాంపియన్ శ్రీలంక జట్లు తలపడనున్నాయి. ఆదివారం జరిగే తుది పోరులో గత ఎడిషన్ ఫైనల్‌కు పునరావృతం కానుంది. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో పాకిస్థాన్‌పై శ్రీలంక నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించి ఫైనల్ బెర్త్ ఖరారు చేసుకుంది.

131 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన శ్రీలంక 8 బంతులు మిగిలుండగానే విజయం సాధించింది. ఒక దశలో 6.2 ఓవర్లలో 33 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయిన ఆ జట్టును హర్షిత సమరవిక్రమ (36), కవిషా దిల్హారి (33) ఆదుకున్నారు. ఐదో వికెట్‌కు 67 పరుగుల భాగస్వామ్యంతో జట్టును విజయానికి చేరువ చేశారు. అయితే పాకిస్థాన్ కెప్టెన్ ఫాతిమా సనా ఒకే ఓవర్‌లో ఇద్దరినీ ఔట్ చేయడంతో శ్రీలంక 109 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయింది. చివరి మూడు ఓవర్లలో 22 పరుగులు అవసరమైన దశలో నిలకశిక సిల్వా (13 నాటౌట్), కౌషిని నుత్యంగన (14 నాటౌట్) సంయమనంతో ఆడి జట్టుకు విజయాన్ని అందించారు.

అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 10 ఓవర్లలో 52 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయింది. కెప్టెన్ ఫాతిమా సనా అజేయంగా 47 పరుగులు చేయడంతో పాకిస్థాన్ 5 వికెట్లకు 130 పరుగులు చేసింది.

2024లో జరిగిన ఆసియా కప్ ఫైనల్లో శ్రీలంక ఎనిమిది వికెట్ల తేడాతో భారత్‌ను ఓడించి తొలిసారి టైటిల్ సాధించింది. ఈసారి హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని భారత జట్టు ఆ ఓటమికి ప్రతీకారం



తీర్చుకోవడంతో పాటు రికార్డు స్థాయిలో ఎనిమిదో ఆసియా కప్ టైటిల్‌ను సొంతం చేసుకోవాలని పట్టుదలగా ఉంది. టోర్నీలో భారత్ వరుసగా నాలుగు విజయాలతో దూసుకెళ్తోంది. గ్రూప్ దశలో మూడు విజయాలతో అగ్రస్థానంలో నిలిచిన టీమిండియా.. సెమీఫైనల్లో బంగ్లాదేశ్‌ను 40 పరుగుల తేడాతో ఓడించి ఫైనల్‌కు చేరింది.

# లండన్‌లో ఏక్‌నాథ్ షిండే విరాట్ కోహ్లీ భేటీ



### క్రీడా మౌలిక వసతులు, క్రీడాకారుల అభివృద్ధిపై చర్చ

**బలగం టీవీ, హైదరాబాద్**

భారత మాజీ క్రికెట్ కెప్టెన్ విరాట్ కోహ్లీ శుక్రవారం లండన్‌లో మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా క్రీడా మౌలిక వసతులు, క్రీడాకారుల అభివృద్ధి, రాష్ట్ర ప్రగతికి సంబంధించిన పలు అంశాలపై ఇరువురు సుదీర్ఘంగా చర్చించారు.

షిండే కోహ్లీకి సంప్రదాయ శాలువా కప్పి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. బ్రిటన్ పర్యటనలో మూడు ప్రతిష్ఠాత్మక అవార్డులు అందుకున్న షిండేకు కోహ్లీ అభినందనలు తెలిపారు. మహారాష్ట్రలో క్రీడా సౌకర్యాలను మరింత విస్తరించేందుకు అవసరమైన విధానపరమైన మార్పులు, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే ప్రతిభావంతులైన క్రీడాకారులను తీర్చిదిద్దడంపై చర్చించారు.

రాష్ట్ర అభివృద్ధికి దోహదపడుతున్న సమృద్ధి ఎక్స్‌ప్రెస్‌వే, నవీ ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయం, కోస్టల్ రోడ్, అటల్ సేతు, వధావన్ పోర్టు వంటి భారీ మౌలిక వసతుల ప్రాజెక్టుల గురించి షిండే వివరించారు. నవీ ముంబయి సమీపంలో ప్రతిపాదిత క్రీడా నగరంలో వివిధ క్రీడలకు ఆధునిక సౌకర్యాలు కల్పించనున్నట్టు తెలిపారు.

యువతకు నాణ్యమైన విద్యతోపాటు అత్యుత్తమ క్రీడా శిక్షణ అందించే ఇలాంటి కార్యక్రమాలను మరింత బలోపేతం చేయడంపై కోహ్లీ ఆసక్తి వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని 'ఖేలో ఇండియా' వంటి జాతీయ కార్యక్రమాలు లక్షలాది మంది యువతను క్రీడలను కెరీర్‌గా ఎంచుకునేలా ప్రోత్సహిస్తున్నాయని షిండే పేర్కొన్నారు.

తన క్రికెట్ ప్రయాణాన్ని గుర్తుచేసుకున్న కోహ్లీ.. క్రికెట్ తనకు ఎంతో ఇష్టమైన క్రీడ అని, భవిష్యత్‌లో ఆటకు దూరమైన తర్వాత కూడా క్రికెట్‌కు తన వంతు సహకారం అందించాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. యువ క్రీడాకారులకు ఫిట్‌నెస్, పోషకాహారం, సరైన ఆహారపు అలవాట్ల ప్రాధాన్యాన్ని వివరించేందుకు కృషి చేస్తానని చెప్పారు.

షిండే లండన్ పర్యటన సెప్టెంబర్ 9న ప్రారంభమైంది. ఈ భేటీలో యువసేన ప్రధాన కార్యదర్శి రాహుల్ కనాల్‌తో పాటు ఉపముఖ్యమంత్రి సీనియర్ సహచరులు పాల్గొన్నారు.

# రిజ్వాన్, ఇమామ్‌లను ప్రశ్నించిన సైబర్ దర్యాప్తు సంస్థ

### డ్రెస్సింగ్ రూమ్ సమాచారం లీకేజీపై దర్యాప్తు..

### ఫోన్లలో ఆర్థిక లావాదేవీల పరిశీలన

**బలగం టీవీ, హైదరాబాద్**

డ్రెస్సింగ్ రూమ్ నుంచి సమాచారం లీక్ చేశారనే ఆరోపణలపై పాకిస్థాన్ సీనియర్ క్రికెటర్లు మహమ్మద్ రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్‌లను జాతీయ సైబర్ క్రైమ్ దర్యాప్తు సంస్థ (ఎన్‌సీసీఐఏ) దాదాపు నాలుగు గంటలపాటు ప్రశ్నించింది. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించిన సంస్థ.. ఇద్దరు ఆటగాళ్ల మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్, సాంకేతిక విశ్లేషణ చేపట్టినట్టు సమాచారం.

ఇంగ్లాండ్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌కు ముందు, తర్వాత రిజ్వాన్, ఇమామ్‌ల ఆర్థిక లావాదేవీలను కూడా అధికారులు పరిశీలిస్తున్నట్టు పాకిస్థాన్ మీడియా వెల్లడించింది. వారి బ్యాంకు ఖాతాల వివరాలు, వ్యక్తులు, సంస్థలు లేదా కంపెనీల నుంచి జరిగినట్లు భావిస్తున్న చెల్లింపులతోపాటు అనుమానాస్పద లావాదేవీలను పరిశీలిస్తున్నట్టు తెలిపింది.

ఇంగ్లాండ్ పర్యటనలో పాకిస్థాన్ జట్టు తీవ్రంగా విఫలమైన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. క్రమశిక్షణా సమస్యల కారణంగా రిజ్వాన్, ఇమామ్‌లతో సహా ఏడుగురు ఆటగాళ్లను, ఇద్దరు సహాయక సిబ్బంది సభ్యులను స్వదేశానికి పంపిన విషయం తెలిసిందే. అనంతరం పాకిస్థాన్ జట్టు భద్రతా అధికారి ఇద్దరు సీనియర్ ఆటగాళ్ల మొబైల్ ఫోన్లను ఎన్‌సీసీఐఏకు అప్పగించారు.

డ్రెస్సింగ్ రూమ్ నుంచి సమాచారం ఎలా బయటకు వెళ్లిందనే అంశంతోపాటు ఇంగ్లాండ్‌లో సాధన, మ్యాచ్‌ల సమయంలో రిజ్వాన్, ఇమామ్ ఎవరెవరిని కలిశారు, ఎవరితో సంప్రదింపులు జరిపారనే విషయాలపై కూడా అధికారులు ప్రశ్నించినట్టు సమాచారం. అయితే ఇద్దరు ఆటగాళ్లపై ఎలాంటి ఆరోపణలను ఎన్‌సీసీఐఏ అధికారికంగా ధ్రువీకరించలేదు.



ఎన్‌సీసీఐఏ దర్యాప్తు కొనసాగుతున్నందున ఈ వ్యవహారంపై మరింత వ్యాఖ్యానించబోమని పీసీబీ ప్రతినిధి తెలిపారు. జాతీయ జట్టు ఆటగాళ్లపై సైబర్ దర్యాప్తు సంస్థకు పీసీబీ ఫిర్యాదు చేయడం ఇదే తొలిసారి.

ఎన్‌సీసీఐఏ ప్రశ్నలకు లిఖితపూర్వక సమాధానాలు ఇచ్చేందుకు మరింత సమయం కావాలని రిజ్వాన్, ఇమామ్ కోరినట్టు సమాచారం. క్రమశిక్షణ, ప్రవర్తనకు సంబంధించిన మీడియా కథనాల నేపథ్యంలో అంతర్గత క్రమశిక్షణా విచారణ ఇప్పటికే ప్రారంభించినట్టు పీసీబీ ప్రకటించింది.

## టీమిండియాలో అతడే అత్యంత ప్రమాదకరి: న్యూజిలాండ్ మాజీ పేసర్ బౌల్ట్

**బలగం టీవీ, హైదరాబాద్**

రాబోయే భారత్, న్యూజిలాండ్ రెండు టెస్టుల సిరీస్‌లో టీమిండియా స్టార్ బ్యాటర్ కెఎల్ రాహుల్ కీలక పాత్ర పోషిస్తాడని, అతడే న్యూజిలాండ్ బౌలర్లకు ప్రధాన సవాల్‌గా మారతాడని కివీస్ మాజీ దిగ్గజ పేసర్ ట్రెంట్ బౌల్ట్ అభిప్రాయపడ్డాడు. అక్టోబర్ 22 నుంచి ప్రారంభం కానున్న భారత్ సుదీర్ఘ న్యూజిలాండ్ పర్యటనలో భాగంగా రెండు టెస్టుల సిరీస్ నవంబర్ 19 నుంచి మొదలుకానుంది. ఈ నేపథ్యంలో పిటిఐ (PTI) వార్తా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో బౌల్ట్ పలు ఆసక్తికర విషయాలను వెల్లడించాడు.

రాహుల్, జైస్వాల్ క్లాసీ బ్యాటర్లు: కెఎల్ రాహుల్ బ్యాటింగ్ శైలికి తాను పెద్ద అభిమానని బౌల్ట్ పేర్కొన్నాడు. "ఇండియన్ టీమ్‌లో రాహుల్ అగ్ర శ్రేణి బ్యాటర్. అతనితో పాటు యంగ్ సెన్సేషన్ యశస్వి జైస్వాల్ కూడా ఉన్నాడు. వీరిద్దరూ ఎంతో క్లాస్ ఉన్న బ్యాటర్లు. న్యూజిలాండ్ మైదానాల్లో వీరి బ్యాటింగ్ చూడటం ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది. టీమిండియా మా దేశంలో పర్యటించడం ఎప్పుడూ ఉత్సాహాన్నిస్తుంది" అని బౌల్ట్ కొనియాడాడు. 37 ఏళ్ల బౌల్ట్ ఖాతాలో టెస్టుల్లో ఏకంగా 317 వికెట్లు ఉన్న విషయం విధితమే.

భారత బ్యాటర్లకు వాతావరణం సవాలే: సాధారణంగా ఫిబ్రవరి-మార్చిలో జరిగే భారత పర్యటన ఈసారి అక్టోబర్ చివరి వారంలో జరగనుండటంతో వాతావరణం తీవ్ర ప్రతికూలంగా ఉంటుందని బౌల్ట్ విశ్లేషించాడు. "న్యూజిలాండ్‌లో అప్పుడే శీతాకాలం ముగుస్తుంది. కాబట్టి వాతావరణం చాలా చల్లగా ఉంటుంది. వెల్లింగ్టన్, క్రైస్ట్‌చర్చ్ పిచ్‌లు పచ్చికతో (Green-top wickets) నిండి ఉండి, మా బౌలర్లకు అనుకూలిస్తాయని భావిస్తున్నాను" అని బౌల్ట్ తెలిపాడు.

కొత్త పేస్ బౌలింగ్ విభాగంపై ధీమా: తాను, టిమ్ సౌథీ, నీల్ వాగ్నర్ కలిసి సృష్టించిన పేస్ శకం ముగిసినప్పటికీ.. ప్రస్తుత కివీస్ బౌలింగ్ విభాగం చాలా బలంగా ఉందని బౌల్ట్ చెప్పుకొచ్చాడు. విల్ ఒరూర్కీ వేగం, కైల్ జెమీసన్ బౌన్స్, మాట్ హెన్రీ కచ్చితత్వంతో జట్టు సమతుల్యంగా ఉందన్నాడు. ముఖ్యంగా నీల్ వాగ్నర్ స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరని, అయితే కొత్త తరం బౌలర్లు తమ సొంత శైలితో విజయాలు అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశాడు.





# కడప రెడ్డమ్మ సరికొత్త చరిత్ర

### అత్యంత వేగంగా 50 వికెట్లు తీసిన తొలి భారతీయురాలిగా 'శ్రీచరణి' రికార్డు!

### కుల్దీప్ యాదవ్ ఆల్-టైమ్ రికార్డును బ్రేక్ చేసిన తెలుగు తేజం బంగ్లాదేశ్‌పై గెలిచి ఆసియా కప్ ఫైనల్లోకి దూసుకెళ్లిన టీమిండియా

**బలగం టీవీ, హైదరాబాద్**

భారత మహిళా క్రికెట్‌లో తెలుగు అమ్మాయి, కడప రత్నం శ్రీచరణి సరికొత్త రికార్డుతో చరిత్ర పుటలకెక్కింది. అంతర్జాతీయ టీ20ల్లో అత్యంత వేగంగా 50 వికెట్ల మైలురాయిని అందుకున్న తొలి భారతీయ ప్లేయర్‌గా (పురుషుల మరియు మహిళల విభాగాల్లో) ప్రపంచ రికార్డు సాధించింది. మహిళల ఆసియా కప్ 2026 టోర్నీలో భాగంగా గురువారం బంగ్లాదేశ్‌తో జరిగిన మొదటి సెమీఫైనల్‌లో ఒక వికెట్ తీయడం ద్వారా శ్రీచరణి ఈ అరుదైన ఘనతను సొంతం చేసుకుంది.

కుల్దీప్ యాదవ్ రికార్డ్ బ్రేక్: ఇప్పటివరకు టీమిండియా తరఫున అత్యంత వేగంగా 50 టీ20 వికెట్లు తీసిన రికార్డు చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ (30 మ్యాచ్‌లు) పేరిట ఉండేది. శ్రీచరణి కేవలం 29 మ్యాచ్‌లోనే ఈ ఫీట్ సాధించి కుల్దీప్‌ను వెనక్కి నెట్టి అగ్రస్థానంలో నిలిచింది.

ప్రపంచ స్థాయిలో: మహిళా క్రికెట్‌లో ప్రపంచవ్యాప్తంగా అతి తక్కువ మ్యాచ్‌ల్లో (29 మ్యాచ్‌లు) 50 వికెట్లు తీసిన రెండో బౌలర్‌గా (చైనాకు చెందిన మెంగ్టింగ్ లియు-28 మ్యాచ్‌ల తర్వాత) శ్రీచరణి నిలిచింది.

రెండో పిన్న వయస్కురాలిగా: 22 ఏళ్ల 37 రోజుల వయస్సులో ఈ ఘనత సాధించిన రెండో భారత పిన్న వయస్కురాలిగా గుర్తింపు పొందింది.

ఒకే ఏడాదిలో 35 వికెట్లు: ఒకే క్యాలెండర్ ఇయర్‌లో అత్యధికంగా 35 వికెట్లు తీసిన పూనమ్ యాదవ్ (2018) సరసన శ్రీచరణి చేరింది.

ఫైనల్లో భారత్.. బంగ్లాపై 40 పరుగుల ఘనవిజయం: శ్రీచరణి రికార్డు మెరుపులతో పాటు భారత జట్టు ఆసియా కప్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. సెమీఫైనల్లో బంగ్లాదేశ్‌పై 40 పరుగుల తేడాతో విజయం సాధించింది.

భారత్ ఇన్నింగ్స్: టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 149 పరుగులు చేసింది. ఓపెనర్ షెఫాలీ వర్మ (64; 40 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లు) హాఫ్ సెంచరీతో చెలరేగింది.

బంగ్లాదేశ్ ఛేజింగ్: 150 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్ నిర్ణీత ఓవర్లలో 7 వికెట్లకు 109 పరుగులకే పరిమితమైంది. భారత బౌలర్లలో దీప్తి శర్మ 3, నందని శర్మ 2 వికెట్లు తీసి ప్రత్యర్థి పతనాన్ని శాసించగా, శ్రీచరణి (1/14) కట్టుదిట్టమైన బౌలింగ్‌తో మెరిసింది.

అద్భుత అర్ధశతకంతో భారత విజయంలో కీలక పాత్ర పోషించిన షెఫాలీ వర్మకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.



# షమీపై గంగూలీకి పూర్తి నమ్మకం

### దేశవాళీ క్రికెట్‌లో రాణిస్తున్నా.. ఎంపిక చేయకపోవడంపై స్పందించిన మాజీ కెప్టెన్

**బలగం టీవీ, హైదరాబాద్**

దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా రాణిస్తున్న టీమిండియా స్టార్ పేసర్ మహమ్మద్ షమీని ఎవరూ పక్కన పెట్టలేదని, అతని సామర్థ్యంపై తనకు పూర్తి నమ్మకం ఉందని క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ బెంగాల్ అధ్యక్షుడు, మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ అన్నారు. అంతర్జాతీయ క్రికెట్‌లో 10 వేలకుపైగా పరుగులు చేసిన తనకే ఏడాది పాటు జట్టులో చోటు దక్కలేదని, ఆ తర్వాత పోరాడి తిరిగి జట్టులోకి వచ్చానని గుర్తుచేశారు.

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ-2025 విజయానంతరం షమీ మళ్లీ భారత జట్టుకు ఆడలేదు. దేశవాళీ క్రికెట్‌లో మంచి ప్రదర్శన చేస్తున్నప్పటికీ సెలెక్టర్లు అతడిని పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. యువ బౌలర్లకు అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో షమీ వంటి సీనియర్లను సెలెక్షన్ కమిటీ దూరం పెడుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయినప్పటికీ షమీ తన ప్రయత్నాలను కొనసాగిస్తున్నాడు. 13 ఏళ్ల తర్వాత ఈస్ట్ జోన్ దులీప్ ట్రోఫీ టైటిల్ సాధించడంలో అతడు కీలక పాత్ర పోషించాడు.

షమీ ఎంపికపై గంగూలీ మాట్లాడుతూ.. "షమీ దేశవాళీ మ్యాచ్‌ల్లో నిలకడగా రాణిస్తున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో 10 వేలకుపైగా పరుగులు చేసిన నాకే ఏడాది పాటు జట్టులో చోటు దక్కలేదు. ఆ తర్వాత పోరాడి తిరిగి వచ్చాను. ఇప్పుడు షమీని ఎందుకు ఎంపిక చేయడం లేదో నాకు తెలియదు. కానీ అతని సామర్థ్యంపై నాకు పూర్తి నమ్మకం ఉంది" అని అన్నారు.

2027 వన్డే ప్రపంచకప్‌లో షమీ ఆడతాడా? అని ప్రశ్నించగా.. మెగా టోర్నీకి ఇంకా ఏడాది సమయం ఉందని, కాబట్టి ఇప్పుడే అతను ఆడతాడా? లేదా? అనే విషయంపై కచ్చితంగా చెప్పలేమని గంగూలీ పేర్కొన్నారు.

ఇషాన్ కిషన్‌పై ప్రశంసలు

దులీప్ ట్రోఫీ ఫైనల్లో అద్భుతంగా రాణించిన ఈస్ట్ జోన్ కెప్టెన్ ఇషాన్ కిషన్‌ను గంగూలీ ప్రత్యేకంగా అభినందించారు. విజయ్ హజారే, సయ్యద్ ముస్తాక్ అలీ, దులీప్ ట్రోఫీతోపాటు అన్ని ఫైనల్స్‌లోనూ ఇషాన్ అద్భుతంగా ఆడాడని అన్నారు. యువ ఆటగాళ్లు టెస్టు క్రికెట్‌లో ఆడాలని కలలు కంటారని, ఇషాన్ కిషన్ కూడా త్వరలో భారత టెస్టు జట్టులోకి పునరాగమనం చేస్తాడని ఆశిస్తున్నట్టు తెలిపారు.



# ఆసియా క్రీడలకు రిషికాంత్ సింగ్ దూరం

### మోకాలి గాయంతో పోటీకి దూరమైన కామన్వెల్త్ రజత పతక విజేత

**బలగం టీవీ, హైదరాబాద్**

మోకాలి గాయం కారణంగా కామన్వెల్త్ రజత పతక విజేత, భారత పురుషుల ఏకైక వెయిట్‌లిఫ్టర్ రిషికాంత్ సింగ్ ఆసియా క్రీడలకు దూరమయ్యాడు. 60 కిలోల విభాగంలో పోటీపడే మణిపూర్‌కు చెందిన రిషికాంత్‌కు గాయం కారణంగా నెల రోజుల పాటు పునరావాస చికిత్స తీసుకోవాలని వైద్యులు సూచించారు.

జూలైలో జరిగిన గ్లాస్గో కామన్వెల్త్ క్రీడలకు వారం రోజుల ముందు రిషికాంత్ మోకాలి గాయానికి గురయ్యాడు. అయినప్పటికీ పోటీల్లో పాల్గొని రజత పతకం సాధించాడు. ఆసియా క్రీడల నాటికి కోలుకుంటాడని భావించినప్పటికీ అది సాధ్యం కాలేదని భారత వెయిట్‌లిఫ్టింగ్ సమాఖ్య వర్గాలు తెలిపాయి.

రిషికాంత్ దూరం కావడంతో ఆసియా క్రీడల భారత వెయిట్‌లిఫ్టింగ్ జట్టులో ప్రస్తుతం నలుగురు మహిళా లిఫ్టర్లు మాత్రమే ఉన్నారు. టోక్యో ఒలింపిక్స్ రజత పతక విజేత మీరాబాయి చాను (49 కిలోలు), జ్ఞానేశ్వరి యాదవ్ (53 కిలోలు), నిరుపమా దేవి (61 కిలోలు), హర్జిందర్ కౌర్ (69 కిలోలు) భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు.

# CINEMA

## జూనియర్ ఎన్టీఆర్ డాన్స్ అంటే ఇష్టం



ఒకప్పుడు తన అందంతో కుర్రాళ్లను కవ్వించిన భామల్లో రంభ ఒకరు. ఆమె అందం నటన ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. అప్పట్లో స్టార్ హీరోల సరసన నటించింది మిప్పించింది. తన అందంతో ఇండస్ట్రీని ఊపేసింది. సినిమాలో హీరోయిన్ గా చేస్తూనే మరో వైపు స్పెషల్ సాంగ్స్ లోనూ మెప్పించింది రంభ. అందం అభినయంతో ఉర్రుతలూగించిన రంభ ప్రస్తుతం సినిమాలకు దూరంగా ఉంటున్నారు. రంభ గతంలో ఓ ఇంటర్వ్యూలో చేసిన కామెంట్స్ ఇప్పుడు మరోసారి వైరల్ అవుతున్నాయి. ఈ ఇంటర్వ్యూలో తన కెరీర్, వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను ప్రేక్షకులతో పంచుకున్నారు. అలాగే జూనియర్ ఎన్టీఆర్ గురించి కొన్ని ఆసక్తికర కామెంట్స్ చేశారు రంభ. యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. మొన్నటి వరకు టాలీవుడ్ స్టార్ హీరోగా రాణించిన తారక్, ట్రిపుల్ ఆర్ సినిమాతో పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగారు. ఇప్పుడు తారక్‌కు ప్రపంచవ్యాప్తంగా అభిమానులున్నారు. ఆయన డాన్స్‌లకు సపరేట్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. టాలీవుడ్‌లో బెస్ట్ డాన్సర్ ఎవరంటే ఎన్టీఆర్ పేరే చెబుతారు. ఎన్టీఆర్ డాన్స్ గురించి ఇప్పటికే చాలామంది సెలబ్రిటీలు ప్రశంసించారు. అలాగే నటి రంభ కూడా తారక్ డాన్స్ పై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, జూనియర్ ఎన్టీఆర్ నటన అంటే ఎంతో ఇష్టమని తెలిపింది. తాను చేసిన ఐటెం సాంగ్స్ లో నాచోరే నాచోరే సాంగ్ అంటే ఇష్టమని రంభ చెప్పింది. ఎన్టీఆర్ డాన్స్ చేస్తే కన్నార్పకుండా చూస్తామని, ఆయన డెడికేషన్ చూస్తే పిచ్చెక్కుతుందని ఆమె పేర్కొంది. తన దృష్టిలో మైకెల్ జాక్సన్ కన్నా తారక్ బెస్ట్ డాన్సర్ అని రంభ ప్రశంసలతో ముంచెత్తింది. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రంభ మహేష్ బాబు, పవన్ కళ్యాణ్ లతో సినిమా చేయాలనే తన కోరికను కూడా బయటపెట్టింది.

## మహిళలే తాళి ఎందుకు ధరించాలి?



ఫస్ట్ మూవీ సొంతంతో సూపర్ సక్సెస్ అందుకున్న హీరోయిన్ నమిత... ఆ తర్వాత స్టార్ హీరోస్ సరసన నటించారు. పెళ్లి తర్వాత సినిమాలకు గ్యాప్ ఇచ్చారు. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈమె... వివాహ సంప్రదాయాలు, మహిళలపై సమాజంలో మోపుతున్న బాధ్యతలు, వివక్షల గురించి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. అసలు పురుషులకు లేని నిబంధనలు మహిళలకే ఎందుకని ప్రశ్నించారు నమిత. 'ఆడవాళ్లే ఎందుకు బొట్టు పెట్టుకోవాలి? మహిళలే తాళి ఎందుకు ధరించాలి? పురుషులకు లేని రూల్స్ మహిళలకే ఎందుకు?' అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. అలాగే, భర్త దీర్ఘాయుష్షు కోసం మహిళలు వరలక్ష్మి వ్రతం చేసే విధానంపైనా నమిత రియాక్ట్ అయ్యారు. నా భర్త సురక్షితంగా దీర్ఘాయుష్షుతో ఉండాలని నేను ఉపవాసం ఉంటాను. కానీ, నా భార్య క్షేమం కోసం భర్త కనీసం ఏడాదిలో ఒక్క రోజైనా కేటాయించాలనే రూల్ ఉందా? సమాజం ఎందుకు అలాంటివి క్రియేట్ చేయలేదు. కట్టు, బొట్టూ విషయంలో అన్నీ రూల్స్ మహిళలకే ఎందుకు? మహిళలు తాళి ధరించాలని ఏ గ్రంథాల్లోనూ లేదు. ఇవన్నీ సమాజం సృష్టించనవే. ఎందులోనూ ఇలాంటి నిబంధనలు లేవు.' అంటూ చెప్పారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 'సొంతం' సినిమాతో టాలీవుడ్?లోకి ఎంట్రీ ఇచ్చిన నమిత తనదైన అందం, నటనతో మంచి ఫేమ్ సంపాదించుకున్నారు. ఆ తర్వాత విక్టరీ వెంకటేశ్‌తో జెమినీ చేశారు. రవితేజ, బాలకృష్ణ, శ్రీకాంత్ వంటి స్టార్స్‌తో కలిసి నటించారు. తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళ భాషల్లోనూ మూవీస్ చేశారు. 2017లో పెళ్లి తర్వాత సినిమాలకు దూరమయ్యారు. చివరగా 2020లో మియా అనే తమిళ మూవీలో నటించారు. రీసెంట్‌గా సోషల్ మీడియాలో యాక్టివ్ అవుతున్నారు. మళ్లీ ఆమె మూవీస్‌లో నటిస్తారనే ప్రచారం సాగుతోంది. అయితే, దీనిపై నమిత అఫీషియల్‌గా రియాక్ట్ కాలేదు.

# విభిన్న పాత్రలను ఎంచుకుంటా



తెలుగుతో పాటు బాలీవుడ్‌లో విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ దూసుకుపోతున్న ప్రముఖ నటి రకుల్ ప్రీత్ సింగ్, తాజాగా తన కెరీర్ ఆకాంక్షలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన సినీ ప్రయాణంలో ఇప్పటివరకు పూర్తి స్థాయి, హృదయాలను హత్తుకునే ఇంటెన్స్ లవ్ స్టోరీలో నటించలేదని, అలాంటి ఎమోషనల్ రొమాంటిక్ డ్రామాలో నటించాలనే బలమైన కోరిక ఉందని వెల్లడించారు. అలాగే చారిత్రాత్మక నేపథ్యం ఉన్న పీరియడ్ డ్రామాలు లేదా హర్రర్ జోనర్‌లలో ఇప్పటివరకు భాగం కాలేదని, ఆ జోనర్లలో కూడా విభిన్నమైన ప్రయోగాలు చేయాలనుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు చేసిన పాత్రలకు భిన్నంగా, నటిగా తనలోని సామర్థ్యాన్ని సవాల్ చేసే స్క్రిప్ట్‌లను ఎంచుకోవడమే ఇకపై తన ప్రాధాన్యత అని ఆమె స్పష్టం చేశారు. ఇకపై సినిమాల విషయంలో బిగ్ బ్యానర్ లేదా జానర్ ప్రాధాన్యత కంటే, తను పోషించే పాత్రకు ఎంతవరకు ప్రాధాన్యం ఉందనేది ముఖ్యమని రకుల్ తెలిపారు. కేవలం తెరపై కనిపించడం మాత్రమే కాకుండా, నటిగా తనను మానసికంగా ఉత్తేజపరిచే మరియు కొత్తదనంతో కూడిన సవాలుతో కూడిన పాత్రలనే అంగీకరిస్తానని ఆమె స్పష్టంచేశారు. ప్రముఖ దర్శకుడు నితీశ్ తివారీ ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న పౌరాణిక చిత్రం 'రామాయణం'లో రకుల్ శూర్పణఖ పాత్రలో కనిపిస్తున్నారు. రణ్‌బీర్ కపూర్ (రాముడు), సాయి పల్లవి (సీత), యష్ (రావణుడు), కాజల్ అగర్వాల్ (మండోదరి) ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ మోస్ట్ అవైటెడ్ చిత్రం మొదటి భాగం నవంబర్ 6న అంతర్జాతీయంగా విడుదల కానుంది.



## 'మహేంద్రగిరి వారాహి' సస్పెన్స్ థ్రిల్లర్



టాలీవుడ్ నటుడు సుమంత్ ఇటీవల అనగనగా, న్యూటన్ థర్డ్ లా వంటి సినిమాలతో మంచి సక్సెస్ అందుకున్నారు. అదే జోష్?లో ఆయన తాజాగా మహేంద్రగిరి వారాహి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. దేవుడు, దెయ్యాలపై ఏ మాత్రం నమ్మకంలేని సిద్ధార్థ్ (సుమంత్) తన యూట్యూబ్ ఛానెల్?తో ప్రజకలను చైతన్యవంతులను చేస్తుంటాడు. అందులో మూఢ నమ్మకాల ప్రచారంతో జనాలను దోచుకునే బురిడీ బాబాల బండారాలకు సంబంధించిన వీడియోలు తన యూట్యూబ్ ఛానెల్?లో పోస్టు చేస్తుంటాడు. అయితే తన సోదరుడు రాజీవ్ (కమల్ కామరాజు)కి పెళ్లి ఖాయం అవుతుంది. కానీ, అతడి జాతకంలో అపమృత్యు దోషం ఉందని, వారాహి అమ్మవారికి పూజలు చేస్తే అది తొలగిపోతుందని చెప్తారు. ఇందుకోసం అతడు విజయనగరంలోని మహేంద్రగిరి ఆలయానికి వెళ్తారు. పూజలు పూర్తయ్యాక రాజీవ్‌తో పాటు ఆ మహేంద్రగిరి రాజ వంశీకుడు నాగేంద్రవర్మ (వంశీ చాగంటి) కన్నుమూస్తారు. దీంతో గత 150ఏళ్లుగా ఆ కుటుంబంలో పుట్టిన మగబిడ్డ ఎవరైనా 33వ పుట్టినరోజునే మరణిస్తారన్న ఆసక్తికర విషయం సిద్ధార్థ్‌కి తెలుస్తుంది. ఆ కుటుంబానికి వారాహి అమ్మవారి శాపంతోనే అలా జరుగుతుందని ఊళ్లో నమ్ముతారు. దీంతో ఆ మరణాల వెనుకు ఉన్న రహస్యాన్ని ఛేదించేందుకు సిద్ధార్థ్ రంగంలోకి దిగుతాడు. ఆ తర్వాత ఏం జరిగింది? అది అమ్మవారు శపమేనా? అసలు సిద్ధు అన్న చావుకి, మహేంద్రగిరి వంశానికి ఉన్న సంబంధం ఏంటి? అనేది బిగ్?స్క్రీన్?పై చూసి తెలుసుకోవాల్సిందే! మహేంద్రగిరి సంస్థానంలోని ఒక రాజవంశం చేసిన పొరపాటు వల్ల, వారాహి అమ్మవారి ఆగ్రహానికి గురై ఆ కుటుంబంలోని మగవాళ్లంతా 33వ పుట్టినరోజు నాడే చనిపోతుంటారు. దీంతో ఇది 'మురారి' సినిమాను గుర్తు చేస్తుంటుంది. కానీ ఇందులో ప్రతీకార నేపథ్యం కథకు కొత్త లుక్ తెచ్చింది. సిద్ధు జొన్నలగడ్డ పాత్ర చుట్టూ నడిచే డ్రామా, హీరో ఫ్యామిలీ మహేంద్రగిరిలో అడుగుపెట్టాక వచ్చే ట్విస్ట్‌లు తో డైరెక్టర్ సంతోష్ ఈ మూవీని చాలా గ్రిప్పింగ్‌గా, వేగంగా ముందుకు నడిపించారు. ఇక ప్రీ ఇంటర్వెల్ సీన్స్?తో కథ ఆసక్తికరంగా మారుతుంది.




## నేడు 'ఆదర్శ కుటుంబం' టీజర్ విడుదల

విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో వస్తున్న 'ఆదర్శ కుటుంబం' (హౌస్ నంబర్: 47) సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా కోసం ఎదురుచూస్తున్న వారికి చిత్ర యూనిట్ ఒక అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చింది. ఈ మూవీ అధికారిక టీజర్‌ను రేపు (శనివారం) మధ్యాహ్నం 12 గంటలకు విడుదల చేయనున్నట్లు సోషల్ మీడియా ద్వారా అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రంలో వెంకటేష్ సరసన 'కేజీఎఫ్' ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుండగా, నారా రోహిత్, నివేదా పేతురాజ్, రావు రమేశ్, వెన్నెల కిషోర్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకు ఎస్.ఎస్. థమన్ సంగీతం అందిస్తున్నారు. గతంలో వెంకటేష్ హీరోగా నటించిన క్లాసిక్ హిట్స్ 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' చిత్రాలకు త్రివిక్రమ్ మాటలు అందించిన సంగతి తెలిసిందే. ఆ చిత్రాల్లోని సంభాషణలు, వెంకటేష్ కామెడీ టైమింగ్ ప్రేక్షకులను ఎంత గానో ఆకట్టుకున్నాయి. మళ్లీ ఇన్నాళ్లకు వీరిద్దరి కాంబినేషన్‌లో పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్ టైనర్ వస్తుండటంతో సినిమాపై విపరీతమైన క్రేజ్ నెలకొంది. ఈ చిత్రాన్ని గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. తాజా అప్‌డేట్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.

## ఈసారి ప్రభాస్ బర్త్ డేకి 'స్పిరిట్' స్పెషల్ బ్లాస్ట్!?

పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా ఇప్పుడు చేస్తున్న భారీ సినిమాల్లో సెన్సేషనల్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్లో చేస్తున్న పక్కా మాస్ యాక్షన్ డ్రామా స్పిరిట్ కూడా ఒకటి. భారీ అంచనాలు ఉన్న ఈ సినిమా షూట్ ఇంకా చాలానే బాకీ ఉంది. అయితే ఈ సినిమా షూట్ మళ్లీ పునఃప్రారంభం కానుంది. ఇక లేటెస్ట్ గా ప్రభాస్ బర్త్ డే బ్లాస్ట్ గా సాలిడ్ ట్రీట్ ని ఈసారి సందీప్ ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తోంది.గతంలో వచ్చినట్టు కేవలం ఆడియో గ్లింప్స్ బ్యాడ్ హాబిట్ లా కాకుండా ఈసారి. నేరుగా ప్రభాస్ పైనే ఓ ఇంట్రెస్టింగ్ యాక్షన్ గ్లింప్స్ తో పరిచయం చేయనున్నట్టు తెలుస్తోంది. సో మిగతా సినిమాలు సంగతి అటుంచితే స్పిరిట్ నుంచి మాత్రం క్రేజీ ట్రీట్ రావడం గ్యారెంటీ అని చెప్పవచ్చు. ఇక ఈ చిత్రానికి హర్ష వర్ధన్ రామేశ్వర్ సంగీతం అందిస్తుండగా రీసెంట్ హిట్ రోమాంచకం నిర్మాణ సంస్థ భద్రకాళి పిక్చర్స్ నిర్మాణం వహిస్తున్నారు.

